


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 07-05-2025 | సంపుటి - 24 సంచిక - 05 రూ : 4 | పేజీలు: 8


# 'గాలి'కి ఏడేళ్ల జైలు

- గనుల అక్రమ తవ్వకాల కేసులో జనార్ధనరెడ్డికి శిక్ష
- శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లకూ..
- గతంలో జైలులో ఉన్న కాలం శిక్షలో మినహాయింపు
- నిర్దోషులుగా మాజీమంత్రి సబితారెడ్డి, కృపానందం
- ఓఎంసీ కేసులో తీర్పు వెలువరించిన సీబీఐ కోర్టు

**మే 06, హైదరాబాద్ :** అనంతపురం జిల్లా ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో ఎట్టకేలకు నిందితులకు శిక్ష పడింది. పదిహేనేళ్ల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ కేసులో న్యాయమూర్తి టి.రఘురాం మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రధాన నిందితులైన బి.వి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్ధనరెడ్డి, వి.డి.రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల చొప్పున జరిమానా విధించారు.

తరువాయి 2లో







## రాష్ట్రంలో అశాంతికి ప్రధాన ప్రతిపక్షం కుట్ర

- మంత్రి పొంగులేటి ధ్వజం

మే 6, కూసుమంచి, : ఉద్యోగ సంఘాలను, ఆర్టీసీ సిబ్బందిని రెచ్చగొడుతూ రాష్ట్రంలో అభద్రతను, అశాంతిని సృష్టించేందుకు ప్రధాన ప్రతిపక్ష పార్టీ కుట్రపన్నుతోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో మంగళవారం జరిగిన పాలేరు నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్షం కుట్రలను ఉద్యోగులు, వారి కుటుంబ

తరువాయి 2లో

# నేడు సైరన్ల మోత



- పౌర అప్రమత్తతపై 300 సివిల్ డిఫెన్స్ జిల్లాల్లో కసరత్తు
- రెండో విభాగంలో హైదరాబాద్, విశాఖపట్నం
- యుద్ధ సన్నద్ధత చాటేలా పాక్ సరిహద్దులో నేడు, రేపు భారీ వైమానిక విన్యాసాలు

**మే 06, ఢిల్లీ:** సరిహద్దు ఉద్రిక్తత వేళ ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేలా ప్రజల్ని సన్నద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం చేపట్టనున్న కసరత్తు (మాక్ డ్రిల్) కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడొందల పైచిలుకు 'సివిల్ డిఫెన్స్ జిల్లా'ల్లో సైరన్లు మోగనున్నాయి. అణు ఇంధన కర్మాగారాలు, సైనిక స్థావరాలు, చమురుశుద్ధి కర్మాగారాలు, విద్యుదుత్పత్తికి వాడే జలాశయాలు వంటివాటిని యుద్ధ సమయంలో ఎలా కాపాడుకోవాలనేదానిపై క్షేత్రస్థాయిలో సన్నద్ధత

తరువాయి 2లో

## మరో 15 ఆలయాల్లో...
# అందరికీ అన్నప్రసాదం

- బాలాజీ ఆలయ నిర్మాణ నిధి, సీజీఎఫ్‌తో... అన్ని నియోజకవర్గాల్లో దేవాలయాల పనులు
- భూముల వాణిజ్య లీజులకు సమగ్ర విధానం తీసుకురండి
- 137 ఖాళీలను భర్తీ చేయండి
- దేవాదాయ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు




**మే 06, అమరావతి:** 'రాష్ట్రంలో ఏడు ప్రధాన ఆలయాలైన శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడ దుర్గమ్మ, ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలంలో మాత్రమే వచ్చిన భక్తులందరికీ నిత్యం అన్నప్రసాదం అమలు జరుగుతోంది. ఇతర ఆలయాల్లో పరిమిత సంఖ్యలో భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరో 15 ప్రధాన, ముఖ్య

తరువాయి 2లో

## పాకిస్థానీయులను వెనక్కి పంపేలా చర్యలు తీసుకోండి



- గవర్నర్‌కు భాజపా నేతల వినతి

**మే 06:** సోమాజిగూడ: తెలంగాణలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులను వెనక్కి పంపేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని భాజపా నేతలు గవర్నర్‌ను కోరారు. ఈ మేరకు ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం

తరువాయి 2లో

## మన జలాలను దేశం దాటనివ్వం

- అవి ఇక్కడి వారి కోసమే: ప్రధాని

దిల్లీ: భారత జలాలను ఇక నుంచి దేశం దాటనివ్వబోమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాల కోసమే వాటిని వినియోగిస్తామని తేల్చి చెప్పారు. పాక్‌తో అమల్లో ఉన్న సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపేస్తున్నామని ఇటీవల కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమ ప్రభుత్వం నదుల

తరువాయి 2లో






# అమరావతి ఓ అధునాతన శక్తి

- ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి
- ఆర్అండ్‌బీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**మే 06, హైదరాబాద్ :** రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా రీజినల్ రింగ్‌రోడ్డు, రేడియల్‌రోడ్లు, ఇతర రహదారులను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆయా రహదారులకు సంబంధించిన కూడళ్లు, అనుసంధాన రోడ్లు అందుకు అనుగుణంగా ఉండాలన్నారు. ఆర్అండ్‌బీ శాఖపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సీఎం తన నివాసంలో మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ (సౌత్) కు సంబంధించిన ఎలైన్‌మెంట్‌ను పరిశీలించిన అనంతరం పలు మార్పులు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ నూతన ఎలైన్‌మెంట్‌కు సంబంధించి సూచనలు చేశారు. సీఎం మాట్లాడుతూ.. అటవీప్రాంతం, జలవనరులు, మండలకేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడార్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఎలైన్‌మెంట్ విషయంలో అనవసర అపోహలకు, పొరపాట్లకు తావివ్వరాదన్నారు. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగానే రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రణాళికలు

తరువాయి 2లో

## రేవంత్.. పరిపాలన చేతకాకపోతే తప్పుకోండి

- తెలంగాణ ప్రతిష్ఠ దెబ్బతినేలా మాట్లాడితే సహించం
- సీఎంపై కేటీఆర్ మండిపాటు

**మే 06, హైదరాబాద్:** "ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు పైసల్లేవ్ కానీ.. అందాల పోటీల నిర్వహణకు డబ్బులున్నాయా? పరిపాలన చేతకాకపోతే తప్పుకోండి సీఎం పదవికి రాజీనామా చేయండి. అంతేకానీ తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడితే సహించం. భారాస పార్టీని, మమ్మల్ని తిట్టినా భరించాం. కేసీఆర్‌ను దూషిస్తే చూస్తూ ఊరుకోం" అని సీఎం

తరువాయి 2లో



# 50 ఏళ్ల అవసరాల మేరకు రహదారుల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

లాగే హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ నూతన ఎలైన్‌మెంట్‌కు సంబంధించి సూచనలు చేశారు. సీఎం మాట్లాడుతూ.. అటవీప్రాంతం, జలవనరులు, మండలకేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడార్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఎలైన్‌మెంట్ విషయంలో అనవసర అపోహలకు, పొరపాట్లకు తావివ్వరాదన్నారు. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగానే రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు రేడియల్ రోడ్ల నిర్మాణ పనుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హైదరాబాద్ మీదుగా వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్‌ఆర్‌ఆర్ వెలుపలికి వెళ్లే ప్రాంతంలో ట్రంపెట్స్ నిర్మించాలన్నారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్‌ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రత్యామ్నాయ ఎలైన్‌మెంట్‌ను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు గల అనుకూలతలను పరిశీలించి నివేదిక రూపొందించాలన్నారు. నూతన రహదారులకు సంబంధించి జాతీయ రహదారులశాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం అదనపు సీఈవో నరసింహారెడ్డి, జాతీయ రహదారుల విభాగం ప్రాంతీయ అధికారి శివశంకర్ పాల్గొన్నారు.

# నేడు సైరన్ల మోత

(మొదటిపేజీ తరువాయి)

తీసుకురానున్నారు. దీనిలో ప్రజల్ని ఎలా భాగస్వాముల్ని చేయాలనేదానిపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. వివిధ విభాగాల అధికారులకు దీనిలో మార్గనిర్దేశం చేశారు. విద్యార్థులు, ప్రభుత్వ/ ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, ఆసుపత్రుల సిబ్బంది, రైల్వే, మెట్రో అధికారులు, పోలీసులు, పారామిలిటరీ బలాలు, రక్షణ బలగాలు దీనిలో పాల్గొనేలా సూచనలు జారీ అయ్యాయి. పరిపాలనపరమైన జిల్లాలు, సివిల్ డిఫెన్స్ జిల్లాలు వేర్వేరు. కంటోన్మెంట్, చమురుశుద్ధి కర్మాగారం లేదా అణుఇంధన కర్మాగారం ఉన్న ఒక్కో ప్రాంతాన్ని సివిల్ డిఫెన్స్ జిల్లాలుగా పరిగణిస్తారు. మాక్‌డ్రిల్ నిర్వహించే ప్రాంతాలను మూడు కేటగిరీలుగా విభజించారు. మొదటిదానిలో ఢిల్లీ, ముంబయి, సూరత్, వడోదర, చెన్నై, కల్పకం, నరోరా వంటివి ఉన్నాయి. రెండో విభాగంలో హైదరాబాద్, విశాఖపట్నం సహా 201 జిల్లాలు ఉన్నాయి. మూడో విభాగంలో 45 జిల్లాలు ఉన్నాయి. గగనతల దాడులపై హెచ్చరించడం, అప్పటికప్పుడు బ్లాకౌట్ చేసే తీరును వివరించడం, ముఖ్యమైన వ్యవస్థల్ని శత్రువు కంటపడనీయకుండా చేయడం వంటివి మాక్‌డ్రిల్‌లో ఉంటాయి. 1971 తర్వాత ఈ స్థాయిలో సన్నద్ధత ఇదే తొలిసారి. దాదాపు ఆరు లక్షల మంది వాలంటీర్లు దీనిలో పాలుపంచుకుంటారు. చాలా రాష్ట్రాల్లో సాయంత్రం 4 గంటలకు ఇది మొదలవుతుంది.

*** గర్జించనున్న రఫేల్, సుఖోయ్, జాగ్వార్‌లు**

పాకిస్థాన్‌తో ఉన్న సరిహద్దు వెంబడి పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో భారత వాయుసేన బుధ, గురువారాల్లో భారీ సైనిక విన్యాసాన్ని నిర్వహించనుంది. రఫేల్, సుఖోయ్ 30 ఎంకెఐ, మిగ్ 29, మిరాజ్ 2000, తేజస్, జాగ్వార్ విమానాలు దీనిలో గర్జించనున్నాయని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు వివిధ వర్గాలను అప్రమత్తం చేసే 'నోటమ్' జారీ చేసింది. గాలిలో, నేలపై శత్రు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఎలా ఛేదించేదీ ప్రదర్శిస్తారు. దాదాపు ఐదున్నర గంటలపాటు ఇవి కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. సరిహద్దు విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలు పూర్తిగా నిలిపివేయనున్నారు. ప్రధాని మోదీతో జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సమావేశమయ్యారు. వీరి మధ్య భేటీ జరగడం 48 గంటల్లో ఇది రెండోసారి.

*** పోరాడండి..**

**వనరులిస్తాం: అమెరికా**

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటానికి అండగా ఉంటామని అమెరికా మరోసారి హామీ ఇచ్చింది. అగ్రరాజ్య ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ ఈ విషయం వెల్లడించారు. ''ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ బలంగా నిలబడాలి. అందుకోసం న్యూదిల్లీ చేసే అన్ని ప్రయత్నాలకు మేం మద్దతు అందిస్తాం. ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఇది కూడా భాగమే. భారత్‌తో బంధం ఎంత ముఖ్యమో ట్రంప్ యంత్రాంగం అర్థం చేసుకుంది. ఉగ్రవాదం నుంచి ఎదురయ్యే ముప్పు ఎలాంటిదో మాకు తెలుసు'' అని వివరించారు.

*** బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌తో అనుమానాస్పద వ్యక్తి**

ఉగ్రదాడి జరిగిన బైసరన్ లోయ సమీపంలో ఓ వ్యక్తి తూటారక్షక కవచం (బుల్లెట్ ప్రూఫ్ జాకెట్) ధరించి, అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో భద్రతా బలగాలు అతడిని అదుపులోకి తీసుకున్నాయి. విచారణలో పొంతన లేని సమాధానాలు ఇవ్వడం, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పకపోవడంతో అతడిని పోలీసులకు అప్పగించాయి. పూంఛ్ జిల్లాలో పాక్ చొరబాటుదారుడిని అరెస్టు చేశారు. తన గ్రామం నుంచి పొరపాటున నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ)ని దాటినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వరుసగా 12వ రోజు దాయాది సైన్యం ఎల్‌వోసీ వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు పాల్పడింది. కుప్వారా, బారాముల్లా, పూంఛ్, రాజౌరీ, నౌషెరా, సుందర్‌బనీ, అఖ్నూర్ వంటి ఎనిమిది సెక్టార్లలో కాల్పుల్ని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. జమ్మూకశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పంటకోతల్ని సత్వరం పూర్తిచేయడానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. పగలూరాత్రీ అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలూ మొహం చాటేయడంతో రైతుల కుటుంబాలే రెక్కలుముక్కలు చేసుకుని, పంటలను బస్తాల్లో సురక్షిత ప్రాంతాలకు

# మరో 15 ఆలయాల్లో... అందరికీ అన్నప్రసాదం

(మొదటిపేజీ తరువాయి)

ఆలయాల్లోనూ అందరికీ అన్నప్రసాదం అమలు చేయాలి. తిరుమల వెంగమాంబ అన్నప్రసాదం తరహాలో ప్రమాణాలు పాటించాలి. రుచి, నాణ్యత, పరిశుభ్రత ఉండేలా చూడాలి. ఆయా ఆలయాల ప్రసాదాల విశిష్టత కొనసాగేలా చూడాలి. నాణ్యత పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆ శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లో కొత్త ఆలయాల నిర్మాణానికి... తితిదే ఏర్పాటు చేస్తున్న 'బాలాజీ ఆలయ నిర్మాణ నిధి' నుంచి సహాయం తీసుకోవాలన్నారు. పాత ఆలయాల పునరుద్ధరణ పనులకు దేవాదాయ శాఖలోని సర్వ శ్రేయో నిధి (సీజీఎఫ్)ని వినియోగించాలన్నారు. ఈ విషయంలో దేవాదాయ శాఖ, తితిదే సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధాన, ముఖ్య ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్‌ప్లాన్‌లు సిద్ధం చేయాలని, అవి ఆగమశాస్త్రానికి అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. 'శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేసే వీలుంది. అక్కడ పరిమితంగా ఉన్న దేవాదాయ శాఖ భూములను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలి' అని సీఎం సూచించారు.

**సమగ్ర విధానం తేవాలి**

'దేవాలయాల భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూసి, వాణిజ్య సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు వీలుగా కమిటీ వేసి సమగ్ర విధానం తీసుకురావాలి. వచ్చే ఆదాయాన్ని ఆయా ఆలయాల అభివృద్ధికి వినియోగించాలి. భూములను హోటళ్లకు లీజుకు ఇచ్చినప్పుడు.. శాకాహారం మాత్రమే ఉండేలా అనుమతించాలి. అన్ని ఆలయాల ఆదాయాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఆస్తుల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో ఉంచాలి. ఆలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం రూ.50 వేలకుపైగా వార్షికాదాయం ఉన్న దేవాలయాల్లోనే సీసీ కెమెరాలు ఉన్నాయి. మరో 24,538 ఆలయాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి. కమిటీలు ఏర్పాటుచేసి, ప్రతి చోటా నిత్యం ధూపదీప నైవేద్యాలు ఉండేలా చూడాలి' అని సీఎం ఆదేశించారు.

**ఖాళీల భర్తీకి పచ్చజెండా**

'డిప్యూటీ కమిషనర్ పోస్టులు 6, సహాయ కమిషనర్ పోస్టులు 5, గ్రేడ్1 ఈవో పోస్టులు 6, గ్రేడ్3 ఈవో పోస్టులు 104, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 16... కలిపి 137 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో భర్తీ చేయాలి. ఈ ప్రక్రియ త్వరగా పూర్తికావాలి. ఆలయాల్లో 200 వరకు వైదిక సిబ్బంది పోస్టుల ఖాళీలను అర్హులైన వారితో భర్తీ చేయాలి' అని చంద్రబాబు ఆదేశించారు.

**175 ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు**

రాష్ట్రంలో 175 ఆలయాల్లో ఆన్‌లైన్ దర్శనం, సేవలు, వసతి, ఈహుండీ వంటివి అమలు చేస్తున్నామని సీఎంకు అధికారులు వివరించారు. రూ.7 కోట్ల కంటే ఎక్కువ వార్షికాదాయం ఉన్న 22 ఆలయాల్లో వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆలయాల్లో పరిశుభ్రత పాటించేలా కేంద్రీకృత పారిశుద్ధ్య నిర్వహణ టెండర్లు పిలిచామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదుల వద్ద హారతులను ప్రతినిత్యం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రమంతటా నోటిఫైడ్ ఆలయాల ద్వారా ఏటా రూ.1,300 కోట్లకుపైగా ఆదాయం వస్తోందని, ఇందులో ఏడు ప్రధాన క్షేత్రాల నుంచే రూ.850 కోట్లు సమకూరుతున్నట్లు చెప్పారు. సర్వ శ్రేయో నిధి (సీజీఎఫ్) కింద వివిధ ఆలయాల్లో రూ.111 కోట్లతో 48 పనులు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి వాడరేవు వినయ్‌చంద్, కమిషనర్ రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అశాంతికి ప్రధాన ప్రతిపక్షం కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చెప్పని మాటలనూ చెప్పినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని గత ప్రభుత్వం రూ.లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. అప్పు ఉందని చెప్పకుంటే తప్పవుతుందని.. రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసినట్లు అవుతుందన్నారు. 'కాళేశ్వరం ఎనిమిదో వింత అన్నట్లు మీరే చెప్పారు.. రూ.1.20 లక్షల కోట్లు పెట్టి కట్టిన ఈ వింత గురించి రాష్ట్ర, దేశ, ప్రపంచ ప్రజలకు చెప్పకుండా ఎలా ఉంటాం?' అని ప్రశ్నించారు. చేసిన అప్పులో పావలా వంతైనా తిరిగి చెల్లించకముందే.. అది కూలిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు చేశామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల కారణంగా మిగతా హామీలు అమలు చేయలేక పోతున్నామని.. భవిష్యత్తులో తప్పకుండా చేస్తామని పేర్కొన్నారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సీఎం సూటిగా చెప్పారు

*** ఆ మాటలను ఆయన ఆవేదనగా భావించాలి**

*** ఉద్యోగులకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం**

*** విలేకరులతో ఇష్టాగోష్ఠిలో శ్రీధర్‌బాబు**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని ముక్కుసూటిగా చెప్పారని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం మాటలను ఆయన ఆవేదనగా భావించాలన్నారు. ఉద్యోగులందరూ సోదరులేనని తమకు వ్యక్తిగతంగా ఎవరితోనూ శత్రుత్వం లేదని చెప్పారు. ఆలస్యమైనా తాము ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. కొందరు ప్రభుత్వాన్ని బెదిరించినట్లు మాట్లాడారని.. అందుకే ముఖ్యమంత్రి అలా మాట్లాడాల్సి వచ్చిందని.. ఆయన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలోని సీఎల్పీ కార్యాలయంలో శ్రీధర్‌బాబు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'గత ప్రభుత్వం తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని దివాలా తీయించింది. వారు చేసిన రూ.7లక్షల కోట్ల అప్పులకు మా ప్రభుత్వం ప్రతినెలా రూ.6వేల కోట్లు వడ్డీ చెల్లిస్తోంది. గతంలో ఉద్యోగులకు మూడో వారంలో జీతాలు పడేవి. మా ప్రభుత్వం రాగానే ఉద్యోగులకు ఒక డీఏ బకాయి చెల్లించాం. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. ప్రతిపక్షాలు అసెంబ్లీని రద్దు చేయాలంటున్నాయి.. ఎందుకు రద్దు చేయాలి? పహల్గాం ఉగ్రదాడికి బాధ్యత వహించి కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అధికారం నుంచి తప్పుకోవాలి... కానీ మేం ప్రతి దానిని రాజకీయ కోణంలో చూడదల్చుకోలేదు. మంత్రులు హెలికాప్టర్ వాడితే విమర్శలు చేయడం అర్థరహితం.

**పుప్పాలగూడలో పరిశ్రమలతో 2 లక్షల ఉద్యోగాలు..**

ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ విషయంలో కక్ష సాధింపు లేదు. అధికారులకు కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి వాటిని అనుసరించాల్సిందే. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుగుతోంది. నివేదికలు రాగానే బాధ్యులపై చట్టపరంగా చర్యలుంటాయి. కానీ కక్ష సాధింపు ఉండదు. ప్రపంచ, దేశవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కొంత ఇబ్బందిగా ఉంది. అయినా రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలిస్తున్నాం. అందాల పోటీలకు, ఉద్యోగుల సమస్యలకు సంబంధం లేదు. ప్రపంచస్థాయి పోటీలు నిర్వహించడం వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ పెరుగుతుంది. ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇవ్వాల్సిన ప్రయోజనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గత సర్కారు హయాంలోని బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఉన్న అవకాశాలపై సబ్ కమిటీ పని చేస్తోంది. పరిశ్రమలు తీసుకురావడం, తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మా ప్రభుత్వం ఉద్దేశం. పుప్పాలగూడలో ప్రభుత్వం 300 ఎకరాలు గుర్తించింది. అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి 2 లక్షల ఉద్యోగాలు కల్పించాలనుకుంటున్నాం.

# పాకిస్థానీయులను వెనక్కి పంపేలా చర్యలు తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ.. 'దేశ భద్రత దృష్ట్యా.. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో చెల్లుబాటయ్యే పత్రాలు లేకుండా ఉంటున్న, వీసాలు గడువు ముగిసిన పాకిస్థానీయులను గుర్తించి వెనక్కి పంపేలా చర్యలు తీసుకోవాలి' అని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. డీజీపీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని లక్ష్మణ్ వివరించారు.

# మన జలాలను దేశం దాటనివ్వం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ అనుసంధానంపై దృష్టి పెట్టిందని, రాష్ట్రాల మధ్య వివాదాలకు జలమే కారణమవుతోందని మంగళవారం ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ఇండియా ఎట్ 2047' సదస్సులో మోదీ అభిప్రాయపడ్డారు. 'ఇంతకుముందు భారత్‌కు హక్కున్న జలాలూ దేశం బయటకు వెళ్లేవి. ఇక నుంచి భారత్ జలాలను భారత్‌లోనే వినియోగించుకుంటాం' అని పేర్కొన్నారు.

# 'గాలి'కి ఏడేళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగి అయిన రాజగోపాల్‌కు అదనంగా 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. నిందితులు జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్‌కు రూ.2 లక్షల జరిమానా విధించారు. వేర్వేరు సెక్షన్ల కింద వేర్వేరుగా ఏడేళ్లు శిక్షలు పడినప్పటికీ ఏకకాలంలో అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ఇప్పటికే జైలులో అనుభవించిన శిక్షను మినహాయింపునిచ్చారు. 2009లో ఓఎంసీ అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేయగా, కేంద్రం అనుమతించింది. సీబీఐ ఎఫ్ఐఆర్‌ను సవాలు చేస్తూ హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు దాకా పలు పిటిషన్‌లు దాఖలు కాగా చివరికి సుప్రీం కోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. 2011లో మొదటి అభియోగ పత్రం దాఖలు చేయగా, అనంతరం ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిని నిందితురాలిగా, గాలి జనార్దనరెడ్డి వ్యక్తిగత సహాయకుడు మెహఫజ్ అలీఖాన్‌ను, నాటి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని నిందితులుగా చేర్చుతూ అనుబంధ అభియోగ పత్రాలు దాఖలు చేసింది. 2009లో నమోదైన కేసులో కోర్టు కేసులు, డిశ్చార్జి పిటిషన్‌లు, హైకోర్టులో క్వాష్ పిటిషన్‌లతో అడుగడుగునా జాప్యం జరుగుతూ వచ్చింది. సుప్రీం కోర్టు ఈ కేసు విచారణను పర్యవేక్షిస్తూ గడువును పొడిగిస్తూ వచ్చింది. చివరికి ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని గడువు విధించడంతో గత నెల 28న వాదనలు ముగించిన సీబీఐ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. 4 అభియోగ పత్రాల్లోనూ కలిపి సీబీఐ 9 మందిని నిందితులుగా చేర్చింది. విచారణ దశలోనే లింగారెడ్డి మృతి చెందగా, శ్రీలక్ష్మిని కేసు నుంచి డిశ్చార్జి చేస్తూ 2022 నవంబరులో తీర్పు వెలువరించింది. మిగిలినవారిలో నలుగురికి జైలు శిక్ష విధించగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది.

**అక్రమ మైనింగ్‌కే పరిమితం**

కేంద్రం నోటిఫికేషన్ ప్రకారం సరిహద్దుల వివాదం, అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు చేయడానికి సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అనంతపురం సరిహద్దుల్లో బళ్లారి రిజర్వుడు ఫారెస్ట్‌లో ఓఎంసీ, బళ్లారి ఐరన్ ఓర్ ప్రైవేట్ లిమిటెడ్‌ల అక్రమ మైనింగ్‌తోపాటు రెండు రాష్ట్రాల సరిహద్దు వివాదంపై దర్యాప్తు చేయడానికి కేసు నమోదు చేసింది. సీబీఐ దర్యాప్తు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 467ను సవాలు చేస్తూ ఓఎంసీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా 2010 డిసెంబరులో సింగిల్ జడ్జి సీబీఐ దర్యాప్తును రద్దు చేశారు. తరువాత సీబీఐ దాఖలు చేసిన అప్పీలుపై విచారించిన ధర్మాసనం 2010 డిసెంబరులో సింగిల్ జడ్జి ఉత్తర్వులను నిలిపివేసింది. అయితే అక్రమ మైనింగ్‌కే దర్యాప్తును పరిమితం చేసింది. సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన కమిటీ సరిహద్దుల వివాదాన్ని తేల్చేదాకా దాని జోలికి వెళ్లరాదని పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రకారం అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు పూర్తి చేసింది.

**ఆలయం కూల్చివేత**

లీజు ప్రాంతానికి సమీపంలో ఉన్న సుంకులమ్మ ఆలయాన్ని ఓఎంసీ ధ్వంసం చేసింది. అక్రమ మైనింగ్‌కు అడ్డుగా ఉందన్న కారణంగా ఆలయాన్ని కూల్చివేసింది. ఆలయం ఉన్న ప్రాంతలో నాణ్యమైన ఖనిజం ఉన్నందున స్థానికుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఆలయం కూల్చివేయడంతోపాటు అక్కడ అసలు గుడే లేదని నిందితులు బొంకారు.

# రేవంత్.. పరిపాలన చేతకాకపోతే తప్పుకోండి

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. 'అణాపైసా అప్పు పుట్టడంలేదంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై' తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో ప్రతిస్పందించారు. ఓవైపు రాష్ట్రం దివాలా తీసిందని మాట్లాడుతూనే.. మరోవైపు తెలంగాణ రైజింగ్ అంటున్నారని విమర్శించారు.

**ఉద్యోగులను సీఎం అవమానిస్తున్నారు**

''సీఎం మాటలు రాష్ట్ర భవిష్యత్తుకు శాపం పెట్టినట్లున్నాయి. దిల్లీ పార్టీలను నమ్మొద్దని ప్రజలకు కేసీఆర్ చిలుకకు చెప్పినట్లు చెప్పారు. ఎన్నికలప్పుడు కేసీఆర్ చెప్పిన మాటలు నేడు అక్షరసత్యాలయ్యాయి. అధికారం కోసం ఎన్నికలప్పుడు రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా హామీలిచ్చారు. వాటిని అమలు చేయకుండా ఇప్పుడు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పరిపాలన చేతకాక కాడిని కిందపడేశారు. ఉద్యోగులకు, ప్రజలకు మధ్య చిచ్చుపెట్టేలా మాట్లాడారు. గొంతెమ్మ కోరికలు అంటూ ఉద్యోగులను రేవంత్ అవమానిస్తున్నారు. రిటైర్ అయిన ఉద్యోగులకు ప్రయోజనాలు ఇచ్చేందుకు పైసలు లేవా? భారాస హయాంలో దేశానికి దిక్సూచిగా ఉన్న తెలంగాణ నేడు ఎందుకు దివాలా తీసింది? మొదట శ్వేతపత్రం పెట్టినప్పుడు భారాస ప్రభుత్వం రూ.6 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. ఇప్పుడేమో రూ.8.50 లక్షల కోట్ల అప్పు చేసిందంటున్నారు. కాంగ్రెస్ సర్కారు రాష్ట్రానికి రూపాయి కూడా ఆదాయం పెంచలేకపోయింది. ఈ ప్రభుత్వం నెలకు రూ.2 వేల కోట్ల అప్పులు మాత్రమే చెల్లిస్తోంది. గత పదేళ్లలో తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్. కిరణ్‌కుమార్‌రెడ్డి మాకు రాష్ట్రాన్ని అప్పగించినప్పుడు 12వ స్థానంలో ఉండేది. ఆదాయం పెరిగిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టాం. బంగారు తెలంగాణను సీఎం రేవంత్‌రెడ్డి 17 నెలల పాలనలోనే అస్తవ్యస్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల ఆదాయం గణనీయంగా పడిపోయింది. రూ.170 కోట్ల కమీషన్ ఇచ్చి.. ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టే పరిస్థితికి వచ్చింది. రాష్ట్రం దివాలా తీస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆదాయం ఎలా పెరుగుతోంది? 17 నెలల తన పాలనపై రేవంత్ శ్వేతపత్రం విడుదల చేయాలి. అడ్డగోలు వ్యాఖ్యలు మాని సంపద పెంచే ఆలోచన చేయాలి'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో

# వారం లోగా ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేయాలి

*** టెలి కాన్ఫరెన్స్ లో అధికారులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిలో ఇంకుడు గుంతల నిర్మాణాలు వారంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పురోగతిలో ఉన్న ఇంకుడు గుంతల నిర్మాణం, పామ్ పౌండ్స్ నిర్మాణాలు మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా ల పై అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవోలు, జిల్లా అధికారులు,తాసిల్దార్ లు,మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు,ఎంపీఓలు,పంచాయతీ సెక్రటరీలు మరియు సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్




ద్వారా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు తదితర అన్ని కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రతి ఎకరానికి ఐదు ఇంకుడు గుంతలు అర ఎకరానికి మూడు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే వర్షం నీరు నిలువ ఉంటాయో గుర్తించి అటువంటి చోట ఎక్కువ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతల నిర్మాణాలు ఉండాలన్నారు. అయినా ఇంకుడు గుంతల నిర్మాణాలను లను పంచాయతీ సెక్రటరీలు జల్ సెంచెయ్ జెన్ భాగీ దారి పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. జెల్ సంచెయ్ జన్ భాగీదారి లో దేశంలోనే మొదటి స్థానంలో జిల్లాను నిలపాలని అధికారులు ఆదేశించారు. వచ్చేవారం నుండి వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని వ్యవసాయానికి యోగ్యమైన భూముల్లో నీటి కుంటల నిర్మాణానికి మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడున్నర లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నదని దానిలో పదో వంతు 34 వేల నీటి కుంటలు త్రవ్వకాలు చేపట్టాలని, 10 ఎకరాలకు ఒక నీటి కుంట తప్పనిసరిగా ఉండాల్సిందే అని కలెక్టర్ చెప్పారు. ఉపాధి హామీ సిబ్బంది , వ్యవసాయ అధికారులు సమన్వయంతో నీటికుంటలకు మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నీటి కుంటల నిర్మాణం చేపడతామని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా నీటి కుంటల ఆవశ్యకత పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి గుంటలో నిర్మించడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని చేపల పెంపకం చేపట్టవచ్చని తెలియజేయాలన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా మునగ సాగు గురించి అవగాహన కల్పించాలన్నారు. మునగ సాగు చేసి విజయం సాధించిన రైతుల గురించి చెప్పాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా రూపకల్పన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంతకం చేసిన జాబితాను ప్రతిరోజు వార్డు, గ్రామ, మండల స్థాయి నివేదికలను అందించాలన్నారు. పూర్తి అయిన జాబితాలను ఇన్చార్జి మంత్రి అనుమతి కొరకు ప్రతిరోజు పంపించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## కొత్తగూడెంలో ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వర్షపు నీటిని వృధా చేయకుండా ఇంకుడు గుంతల ద్వారా భూగర్భజలాలను రీఛార్జ్ చేయాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి .పాటిల్ ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంత నిర్మించాలని సూచించారు. ఈ మేరకు కొత్తగూడెం మండలంలో గల సకల ప్రభుత్వ పాఠశాలలో ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తయినట్లు ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ తెలిపారు. అలాగే మండలంలో రామవరం, కూలీలైన్, ఆనందఖని ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించబడుతున్నాయనీ 6 నుండి 9 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు ఈ శిబిరాల్లో పాల్గొంటూ వేసవి సెలవుల్ని అర్థవంతంగా ఆహ్లాదకరంగా వినియోగించుకోవాలని కోరారు. బుధవారం పాఠశాలలకు గ్రీన్ బోర్డులు సరఫరా కానున్నట్లు ఎంఈఓ తెలిపారు.

## ఉప్పల్ నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి .**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.మంగళ వారం నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడం జరిగింది. పది లక్షల రూపాయల నిధులతో స్నేహపురి కాలనీ డాక్టర్ సైదయ్య హాస్పిటల్ ముందు పార్క్ లోపల ఓపెన్ జిమ్ ఏర్పాటు కొరకు అలాగే యాభై లక్షల రూపాయల నిధులతో అన్నపూర్ణ కాలనీలోని బుడగ జంగాల స్మశాన వాటిక అభివృద్ధి పనుల కొరకు స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ తో కలిసి భూమి పూజ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, డి ఈ బాలక్రిష్ణ ,ఏ ఈ

## ఏరియా సింగరేణి జిఎంకు కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సమ్మె నోటీసు అందజేత

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మే 20వ తేదీన సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు అందులో భాగంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు పాల్గొన నున్నారని, ఈ సమ్మె సందర్భంగా అన్ని యూనియన్లు చేస్తున్న డిమాండ్ల పరిష్కారం కోసం సింగరేణి యాజమాన్యం సహకరించాలని కోరుతూ మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నోటీసును సింగరేణి ఏరియా ఎస్ ఓ టు జి ఎం కోటిరెడ్డికి సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక హక్కులను కాలరాస్తూ బిజెపి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు వారు తెలిపారు. అనేక సంవత్సరాల నుండి కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం పోరాటాలు వల్ల



కార్మిక చట్టాలను రూపొందించుకొని హక్కులు సాధించుకున్నామని వారన్నారు. అట్టి హక్కులను మళ్లీ తిరగరాస్తు 28 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా కుదించి కార్మిక హక్కులను హరించే వేసే విధంగా నేటి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వారన్నారు . ఒకవైపు ధరలు 400 శాతం పెరిగాయని అందుకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మిక వేతనాలు రోజు రోజుకు దిగజారిపోయి బానిస బతుకుల్లాగా తయారయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు శక్తి పడిపోయి బ్రతుకు బండి లాగ లేని స్థితికి దిగజారిన కార్మిక వర్గం ఒక్క తాటిపైకి వచ్చి మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు భూక్య రమేష్, పెద్దబోయిన సతీష్, మడిపల్లి కరుణాకర్, గూడెల్లి యాకయ్య, భాషబోయిన రవి, తాండ్ర విజయ్, ఎం చంద్రశేఖర్ , మంద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీపై అపోహలొద్దు...

*** ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న సింగరేణి ఉద్యోగి**

*** సింగరేణి విజిలెన్స్ ఇచ్చిన సమాచారంతోనే పట్టుకున్నాం**

*** ఏసీబీ డీఎస్పీ వై.రమేష్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని, మెడికల్ అన్ఫిట్, బదిలీలు చేయిస్తానని నమ్మబలికించి పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న సింగరేణి ఉద్యోగి అయిన అన్నెబోయిన రాజేశ్వరరావును పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలో జరిపిన ఏసీబీ దాడుల గురించి ఆయన వివరించారు. సింగరేణిలో నోటిఫికేషన్లు పడిన సందర్భంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, అవసరమైన చోటకు సింగరేణి ఉద్యోగస్తులను బదిలీలు చేయిస్తామని, మెడికల్ అన్ఫిట్ చేయిస్తామని చెప్పి సింగరేణి కార్పొరేట్ ఏరియాలో





డ్రైవర్గా పనిచేస్తున్న అన్నెబోయిన రాజేశ్వరరావు సుమారు రూ.50 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిసిందన్నారు. ఇప్పటి వరకు రూ.30 లక్షలకు సంబంధించిన వివరాలు సేకరించామని అన్నారు. సింగరేణి విజిలెన్స్ విభాగం ఇచ్చిన సమాచారంతోనే రాజేశ్వరరావును పట్టుకున్నట్లు తెలిపారు. రాజేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని అన్నారు. ఇంకా ఎక్కువ మొత్తంలో అవినీతి జరిగినట్లు తెలుస్తోందన్నారు. సంస్థకు సంబంధించి ఇతర అధికారుల పాత్రమైనా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఏసీబీకి ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తారనే అపోహలు వద్దని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టబద్ధమైన పనులు జరగాల్సినవి ఉంటే ప్రజలకు ఏసీబీ అండగా ఉంటుందని, అధికారులు ఎవరైనా రూ.100నుంచి మొదలుకొని ఎంత డిమాండ్ చేసినా నేరమేనన్నారు. డబ్బులతోపాటు వస్తువులు లంచం రూపంలో తీసుకున్నా నేరమేనన్నారు. డబ్బులు డిమాండ్ చేయడం, డబ్బులు వసూలు చేయడం, లంచం ఇవ్వమని ప్రేరేపించడం కూడా నేరమేనని అన్నారు. అటువంటివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే మా యొక్క టోల్ఫ్రీ నెంబర్ 1064 లేదా ఖమ్మం ఏసీబీ డీఎస్పీ నెంబర్ 9154388981కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## కార్మికుల సంక్షేమానికి జిల్లా కార్మిక శాఖ కృషి చేస్తుంది

*** మేడ్చల్ జిల్లా కార్మిక శాఖ అధికారి సాయి సుమన్**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కార్మికుల సంక్షేమానికి జిల్లా కార్మిక శాఖ కృషి చేస్తుందని మేడ్చల్ జిల్లా కార్మిక శాఖ అధికారి సాయి సుమన్ పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి లో దుర్గామాత భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చదివేంద్రమును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నమని ఆయన తెలిపారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం దుర్గామాత భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటయ్య, మందుల మల్లేష్ లు కార్మిక శాఖ అధికారి సాయి సుమన్ ను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సత్తయ్య, అంజయ్య, మల్లేష్, కృష్ణ, తూర్పాటి స్వామి, యాకయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు

## కాప్రా డివిజన్ లో నూతన పవర్ బోర్ల పనులు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా డివిజన్ లోని అశోక్ ఎన్ క్లేవ్ , ఎన్ ఆర్ ఐ కాలనీల పార్కుల్లో నూతన పవర్ బోర్ల డ్రిల్లింగ్ పనులను కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ డివిజన్ లోని అశోక్ ఎన్ క్లేవ్ , ఎన్ ఆర్ ఐ కాలనీల పార్కుల్లో రూ. పదిహేడు లక్షల వ్యయం తో నూతన పవర్ బోర్ల డ్రిల్లింగ్ పనులు ప్రారంభించామని తెలిపారు. డివిజన్ లోని కాలనీలలో మౌలిక సదుపాయల కల్పన తో పాటు వాతావరణం సంరక్షణ, ప్రజల ఆరోగ్య క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛమైన వాతావరణం కొరకు ఆహ్లాదకరమైన పార్కుల సుందరికరణ పనులకు కృషిచేస్తున్నానని తెలిపారు. ఆయా పార్కుల్లో పచ్చదనం పెంపొందించడానికి మొక్కలను నాటి సంవృద్ధిగా నీటి సదుపాయం కల్పించడానికి నూతన పవర్ బోర్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలకు అదునాతన వసతులతో కూడిన ఆహ్లాధకరమైన సుందర ప్రకృతి వనం వంటి పార్కులను నిర్మిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గ్రేటర్ హైదరాబాద్ ను పచ్చని పర్యావరణం గల గ్రీన్ సిటీ గా పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కాప్రా డివిజన్ జి హెచ్ ఎమ్ సి లో మొదటి డివిజన్ కావటం తో రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం పూర్తిగా లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ ఎన్ క్లేవ్ , ఎన్ ఆర్ ఐ కాలనీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ని సన్మానించి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో యూ బి డి మేనేజర్ లోకేష్, సిబ్బంది జి అజయ్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి, బాబురావ్, నరేందర్ గౌడ్ , సంతోష్ చారి , కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా కోలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు , అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు నాయకుల, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నరెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు కొలను



రాజశేఖర్ రెడ్డి,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి లు పాల్గొని ఆయనను పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ... యువజన నాయకులు బొంగునూరి కిశోర్ రెడ్డి , సీనియర్



కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు ,యువజన కాంగ్రెస్ నాయకులు, ఐఎన్టీయూసి, ఎన్ఎస్యుఐ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

రాజాపేట , ప్రజా స్ఫూర్తి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శమని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశయ సాధన లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం రాత్రి రాజాపేట మండలం రేణిగుంట గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తో కలిసి ఆయన ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. కరాటే బాలు (నీరటి బాల నరసయ్య) సభా అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, అంబేద్కర్ విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, తాజా మాజీ ఎంపీటీసీ బొద్దుల మౌనిక నగేష్, రాజపేట పట్టణ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, ఆలేరు నియోజకవర్గం ఎస్సీ సెల్



నాయకులు ఇంజ నరేష్, నమిల కేదారి, గౌటే లక్ష్మణ్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూకంటి ప్రవీణ్, రఘునాథపురం రమేష్, కల్లెం పాండు, బొంతు సుధాకర్, రంగా నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సిసి రోడ్డు ను ప్రారంభించారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శాలువాతో సత్కరించి కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరినీ నీరటి బాల నర్సయ్య ఆధ్వర్యంలో చేనేత శాలువాలతో సత్కరించారు. అంతకుముందు బసంతాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెండు భాస్కర్ రెడ్డి భార్య స్వప్న మృతి చెందగా మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించి భాస్కర్ రెడ్డిని పరామర్శించారు. పుట్టగూడెం తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రాంజీ నాయక్ అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరామర్శించారు



# అక్రమ వలసదారులు దేశం విడిచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి

* **బీజేపీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : అక్రమంగా భారత దేశంలోనే ఉంటున్న పాకిస్థానీయులు, బంగ్లదేశీయులు, రోహ్యాంగులను వెంటనే దేశం విడిచి వెళ్లేలా కఠినమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. అక్రమ వలసదారులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్ తో కలిసి ఆయన స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఒ స్వామి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవరం కాంతారావు మాట్లాడుతూ పహల్గమ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయడమే లక్ష్యంగా దేశంలో ఉంటున్న పాకిస్థానీయుల వీసా గడువును కుదించిన సంగతి తెలిసిందేనన్నారు. ఇక గడువు ముగిసిన తర్వాత కూడా పెద్ద సంఖ్యలో పాకిస్థానీయులు, బంగ్లదేశీయులు, అక్రమ చొరబటులైన రోహ్యాంగులను నివసిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అధికారికంగానే 220 మంది అక్రమ వలసదారులు ఉంటే అనాధికారికంగా 500 పైచిలుకు మంది ఉంటారని అంచనాలు ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. మన దేశ భద్రత సంబంధించిన విషయంలో రాజీలేని పోరాటం చేస్తున్న భారత ప్రభుత్వానికి , త్రివిధ దళాలకు భారత పౌరులుగా మనమంతా సహకరించాల్సిన సమయం ఆసన్నమైనందున, ఇట్టి విషయాన్ని పరిగణనలోకి తీసుకుని.. భారతీయ జనతా పార్టీ పక్షాన ఎంఆర్ఒకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు పవన్, గోపి, సోమశేఖర్, భగవంత్, రవి, రమేష్, రాములు, కోటేశ్వరరావు, లహరి, సూరి, ప్రేమ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తా

* **వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్లో గల కమల ప్రసన్న నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, రంగారావు లు ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించి జీహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ అధికారులతో కలిసి కాలనీలో పలు సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని రోడ్ నెంబర్లు 12, 13 లలో సివరేజ్ లైన్లు చిన్నవిగా ఉండటంతో తరచూ మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందని, ఇది ప్రజలకు



తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోందని తెలిపారు. ప్రస్తుతం మాన్యువల్ క్లీనింగ్ జరుగుతున్నప్పటికీ ఇది తాత్కాలిక పరిష్కారమని, ముందుగా ఒక అడుగు వెడల్పుతో కొత్త సివరేజ్ లైన్ వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిపాదన మంజూరు చేయించామని, త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో సిమెంట్ రోడ్డుకు మంజూరు లభించిన విషయాన్ని ఆమె వెల్లడించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరగా రోడ్డు పనులు ప్రారంభించాల్సిందిగా జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ఈ పాదయాత్రలో హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ మేనేజర్ ప్రియాంక, జిహెచ్ఎంసి అధికారులు నిఖిల్, కాలనీ అధ్యక్షులు శేఖర్, రాఘవులు, ఆంజనేయులు, రాజు, శ్రీశైలం గౌడ్, రాము, తిరుపతి, బండప్ప తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు" సంఘం అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

* **బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా లక్ష్మీ నారాయణ ఏకగ్రీవంగా నియమితులైన సందర్భంగా మున్నూరు కాపు సంఘం కుల బంధువులు సోమవారం సాయంత్రం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో హ్యాట్రిక్



విజయాన్ని అందించి నా గెలుపులో అత్యంత కీలకంగా వ్యవహరించిన "మున్నూరు కాపు" సంఘం కుల బాంధవులందరికీ ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. మున్నూరు కాపు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన లక్ష్మీ నారాయణ కి సంఘం బలోపేతం, డిమాండ్లను సాధనలో మంచి అవగాహన ఉందని అన్నారు. కుల బంధువులు, సంఘ సభ్యుల సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి లోని ఎనిమిది డివిజన్లు, నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీ ప్రాంతాలకు చెందిన వివిధ సంఘాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మన దేశ జలాలు.. మన హక్కు: ప్రధాని మోదీ

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. భారత్‌కు ఉద్దేశించిన జలాలు ఇక్కడే ఉంటాయని, వాటిని దేశ ప్రయోజనాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ''ఇదివరకు భారత్‌కు దక్కాల్సిన నీటి వాటా కూడా బయటకు వెళ్లిపోయేది. కానీ, ఇప్పుడు భారత జలాలు ఇక్కడే ప్రవహిస్తాయి. ఇక్కడే నిలుస్తాయి. ఇక్కడి ప్రయోజనాలు తీర్చుతాయి. మన దేశ



జలాలు.. మన హక్కు'' అని ఓ వార్తాసంస్థ కార్యక్రమంలో తెలిపారు.

# ఆ మాటలు సీఎం ఆవేదనగా భావించాలి

: **మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్: ఉద్యోగ సంఘాల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేస్తూ మాట్లాడిన అంశంపై విమర్శలు రావడంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. తమ ముఖ్యమంత్రి ముక్కుసూటిగా మాట్లాడారని, ఆయన మాటల్ని ఆవేదనగానే భావించాలని చెప్పారు. మీడియాతో మంత్రి శ్రీధర్‌బాబు వివిధ అంశాలపై మాట్లాడారు. ''భాజపా నాయకులు పదవి దిగిపోవాలని అంటున్నారు. పహల్గాం ఘటనకు బాధ్యత వహించి భాజపా నేతలే పదవి నుంచి తప్పుకోవాలి. ఉద్యోగుల డిమాండ్లు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం. హామీలు ఇచ్చేప్పుడే అన్ని అంచనాలు వేసుకొని ఇచ్చాం. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ విషయంలో కక్ష సాధింపు లేదు. అధికారులు కొన్ని నియమ నిబంధనలు అనుసరించాల్సిందే. అందాల పోటీలకు, ఉద్యోగ సమస్యలకు లింక్ పెట్టొద్దు. రాష్ట్ర ప్రతిష్ఠతను ప్రపంచస్థాయిలో పెంచేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నాం'' అని అన్నారు.

# కేదార్‌నాథ్ యాత్ర.. అంతుచిక్కని వ్యాధితో గుర్రాల మృత్యువాత!

చార్‌ధామ్ ఆలయాల్లో ఒకటైన కేదార్‌నాథ్ ద్వారాలు ఇటీవల తెరచుకున్నాయి. ఈ క్రమంలోనే కాలినడకన, గుర్రాలు, కంచర గాడిదలు, డోలీలపై భక్తులు మంచు కొండల్లోని శైవ క్షేత్రానికి చేరుకుంటున్నారు. అయితే, యాత్ర మార్గంలో పలు గుర్రాలు, కంచర గాడిదలు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడటం కలవరపెడుతోంది. రెండు రోజుల వ్యవధిలో 14 మూగజీవాలు ప్రాణాలు విడిచాయి. దీంతో అప్రమత్తమైన ఉత్తరాఖండ్ సర్కారు.. యాత్ర మార్గంలో 24 గంటలపాటు వీటి వినియోగంపై నిషేధం విధించింది. ఈ నెల 4న ఎనిమిది గుర్రాలు, కంచర గాడిదలు, మరుసటి రోజు మరో ఆరు జంతువులు మృత్యువాతపడినట్లు అధికారులు వెల్లడించారు. వాటి మరణాలకు గల కారణాలను వెలికితీసేందుకు కేంద్రం నుంచి నిపుణుల బృందం రానున్నట్లు తెలిపారు. ''బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా మరణాలు సంభవించినట్లు అనుమానిస్తున్నాం. ఈక్విన్ ఇన్‌ఫ్లుయెంజా (హార్స్ ఫ్లూ) వ్యాప్తినీ కొట్టిపారేయలేం. అయితే.. నిపుణుల బృందం పరిశీలించిన అనంతరం కచ్చితమైన కారణాలు తెలుస్తాయి. ప్రస్తుతానికి కేదార్‌నాథ్ మార్గంలో గుర్రాలు, కంచర గాడిదల వినియోగంపై 24 గంటల నిషేధం



విధించాం'' అని వెల్లడించారు. ''ఏప్రిల్ 4న స్థానికంగా మొదటి ఈక్వైన్ ఇన్‌ఫ్లుయెంజా (హార్స్ ఫ్లూ) కేసు నమోదైంది. నెలాఖరు నాటికి 16 వేల గుర్రాల నమూనాలను పరీక్షించాం. వీటిలో 152 నమూనాలు పాజిటివ్‌గా తేలాయి. అయితే.. ఆర్టీపీసీఆర్ పరీక్షలో మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ప్రస్తుతం విధించిన 24 గంటల నిషేధాన్ని ఎత్తివేసిన అనంతరం.. టెస్టులో నెగెటివ్‌గా తేలిన గుర్రాలు, కంచర గాడిదలను మాత్రమే యాత్ర మార్గంలో అనుమతిస్తాం. 15,16 రోజుల క్రితం ఇన్ఫెక్షన్ సోకి ప్రస్తుతం కోలుకున్న వాటిని కూడా అనుమతిస్తాం'' అని అధికారులు తెలిపారు.

# మే 7 నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ: మంత్రి నాదెండ్ల

అమరావతి: రాష్ట్రంలో మే 7నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త కార్డులు జారీ, రేషన్‌కార్డు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం 3.28లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డును జారీ చేస్తామని చెప్పారు. ఇందులో కుటుంబసభ్యుల పేర్లు చక్కగా కనిపించేలా ఉంటుందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే గడిచిన ఆరు నెలలుగా తీసుకున్న రేషన్ వివరాలు కనిపిస్తాయని చెప్పారు. "దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుంది. నెలరోజులపాటు ఈ రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పౌరులు తమ వివరాలు తెలుసుకోవచ్చు. జూన్ నుంచే స్మార్ట్ కార్డులు జారీ అవుతాయి. ప్రస్తుతం 95 శాతం మేర ఈ కేవైసీ పూర్తి అయింది. ఈకేవైసీ పూర్తి అయిన వారు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ నెల



12 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం" అని తెలిపారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని వెల్లడించారు.

## బేబీ కిట్ పథకాన్ని పునరుద్ధరించిన ఏపీ ప్రభుత్వం

అమరావతి: వైకాపా హయాంలో నిలిపివేసిన బేబీ కిట్ పథకాన్ని ఏపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. నవజాత శిశువుల ఆరోగ్యం కోసం 11 వస్తువులతో కూడిన బేబీ కిట్‌ను అప్పటి తెదేపా ప్రభుత్వం పంపిణీ చేసేది. వైకాపా ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపివేయగా.. తాజాగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది.



## దుర్గగుడి ఈవోగా వీకే శీనా నాయక్

అమరావతి: ఏపీలో 9 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఈవోగా వీకే శీనా నాయక్, పులివెందుల ఆర్డీవోగా జి.చిన్నయ్యను నియమించింది. కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మిని ప్రభుత్వం బదిలీ చేసింది. మిగిలిన వారికి ఆయా జిల్లాల్లో మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్లుగా, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



## శ్రీవారి మెట్టు మార్గంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం : తితిదే ఈవో శ్యామలరావు



తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు శ్రీవారి మెట్టు మార్గంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో జె. శ్యామలరావు తెలిపారు. కాలినడకన వెళ్లే మార్గంలో టోకెన్లు పొందేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయం తితిదే దృష్టికి వచ్చిన నేపథ్యంలో.. తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మంతో కలిసి మంగళవారం కాలినడక మార్గంలో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. శ్రీవారి మెట్టు మార్గంలో దర్శనానికి సంబంధించి టోకెన్లు పొందడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోవాలాల నుంచి సరైన సహకారం లేదనే విషయం బోర్డు దృష్టికి వచ్చిందన్నారు. తితిదే కల్పిస్తోన్న సౌకర్యాలను ఆటోవాలాలు తమ స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారని, భక్తుల నుంచి విచ్చలవిడిగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు తితిదే కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్షించి.. మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తిరుపతి నుంచి శ్రీవారి మెట్టు మార్గం వరకు బస్సుల సంఖ్య పెంచడం, టోకెన్ల జారీ కౌంటర్లను పెంచే అంశాలను పరిశీలిస్తామన్నారు. భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

*** తితిదే పాలక మండలి రేపు అత్యవసర భేటీ**

తిరుమలలో బుధవారం తితిదే పాలక మండలి అత్యవసరంగా సమావేశం కానుంది. ఉదయం 11గంటలకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించి బోర్డు తీర్మానాలు చేయనుంది. తితిదే, ఏపీ పర్యాటక శాఖ మధ్య భూ మార్పిడి అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాల కేసు.. క్యామ్‌సైన్ డైరెక్టర్ ధాత్రి మధు అరెస్టు



హైదరాబాద్: ఏపీపీఎస్సీ గ్రూప్ 1 అక్రమాల కేసులో 'క్యామ్‌సైన్ మీడియా' సంస్థ డైరెక్టర్ ధాత్రి మధును పోలీసులు అరెస్టు చేశారు. గ్రూప్ 1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డారని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో హైదరాబాద్‌లోని అతడి కార్యాలయంలో మధును ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విజయవాడకు తరలిస్తున్నారు. మూల్యాంకన కుంభకోణం కేసులో మధును ఏ2గా కోర్టులో పోలీసులు హాజరుపరచనున్నారు. హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో మూల్యాంకన నిర్వహణ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా కొటేషన్ విధానంలో పొందిన క్యామ్‌సైన్ సంస్థ.. ఇతర విషయాల్లోనూ అవకతవకలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కుంభకోణంపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులను ఏ1గా చేర్చిన విషయం తెలిసిందే.

## అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీ సమీపంలో భారీ అగ్ని ప్రమాదం..





అనకాపల్లి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గత కొద్ది రోజులుగా ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షంతో పాటు గాలి, దుమారం చెలరేగి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ క్రమంలోనే అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీ సమీపంలో గాలి దుమారానికి విద్యుత్ వైర్లు తెగిపడి అగ్ని ప్రమాదం జరిగింది. హైటెన్షన్ విద్యుత్ వైరు తెగి ఓ తుక్కు దుకాణంలో పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గాలి దుమారం వల్ల మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని, మంటల్ని అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రమాదంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## త్వరలో జగన్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: పట్టాభిరామ్

- * యాక్సెస్ ఎనర్జీ ఒప్పందంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్న పట్టాభిరామ్
- * గత ప్రభుత్వం యూనిట్‌కు రూ.5.12కు ఒప్పందం
- * తాము రూ.4.60కే కుదుర్చుకున్నామని వెల్లడి
- * ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర ఖజానాకు రూ.2,719 కోట్ల ఆదా
- * ప్రజాధనం ఆదా చేయడం జగన్‌కు నేరమా అని ప్రశ్న



యాక్సెస్ రెన్యువబుల్ ఎనర్జీ ఒప్పందం విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ప్రభుత్వం కంటే తక్కువ ధరకే తాము ఒప్పందం కుదుర్చుకుని రాష్ట్ర ఖజానాకు రూ.2,719 కోట్లు ఆదా చేశామని ఆయన స్పష్టం చేశారు. జగన్ రెడ్డి బుద్ధి ఎలాంటిదో ప్రజలు తెలుసుకోవాలి.. వాస్తవాలను గ్రహించాలని అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం 2022 నవంబర్ 24న యాక్సెస్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థతో యూనిట్‌కు రూ.5.12 చొప్పున ఒప్పందం కుదుర్చుకుందని, తాము అధికారంలోకి వచ్చాక దానిని యూనిట్‌కు రూ.4.60కే సవరించి, తద్వారా రూ.2,719 కోట్లు ఆదా చేశామని పట్టాభిరామ్ వివరించారు. వైసీపీ నేతలు తమ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారంతా 'జైల్‌మేట్స్' అని, మళ్లీ అక్కడికే వెళతారని వ్యాఖ్యానించారు. యాక్సెస్ రెన్యువబుల్ ఎనర్జీ ఒప్పందాలపై జగన్ రెడ్డి పకోడీ ఛానెల్, కరపత్రికలో విషం చిమ్ముతూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలపై భారం పడకుండా రూ. 2,719 కోట్లు తగ్గించడం జగన్ రెడ్డికి నేరమా? అని ప్రశ్నించారు. రకరకాల కుంభకోణాల్లో వైసీపీ నేతలు తిన్నదంతా బయటకు వస్తుందని.. జగన్ రెడ్డికి గతంలో ఆత్మగా వ్యవహరించిన వ్యక్తికి నేడు పట్టిన గతే జగన్ రెడ్డికి కూడా త్వరలో పడుతుంది.. వారందరూ త్వరలోనే జైల్లో సంతోషంగా కలుసుకొని కబుర్లు చెప్పుకోవచ్చని పట్టాభి ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సీ) ఆదేశాల మేరకే ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్లపై నిర్ణయాలు తీసుకుంటోందని పట్టాభిరామ్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పాత విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏ) రద్దు చేస్తూ జీవో ఇచ్చి, కేంద్రం అక్షింతలు వేశాక, పలు కంపెనీలు కోర్టుకెళ్లాయని గుర్తుచేశారు. చివరికి, 2022 ఆగస్టులో పాత ఒప్పందాలను కొనసాగిస్తామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి, అదే ఏడాది నవంబర్‌లో యాక్సెస్ సంస్థతో ఏపీఈఆర్సీ నిర్ణయించిన రూ.5.12 ధరకే పీపీఏ కుదుర్చుకుందని ఆధారాలతో సహా వివరించారు. తాము యూనిట్ ధరను రూ.4.60కి తగ్గించి ఒప్పందం చేసుకుంటే వైసీపీ నేతలు ఎలా ప్రశ్నిస్తారని సవాల్ విసిరారు. ప్రస్తుత మార్కెట్ ధరల కంటే ఎక్కువ రేటుకు పీపీఏ చేసుకున్నామన్నది అవాస్తవమని, ఫర్మ్ అండ్ డిస్పాచబుల్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల ధరల కంటే తాము చేసుకున్న పీపీఏ రేటు తక్కువేనని స్పష్టం చేశారు. బ్యాటరీ స్టోరేజ్ బాధ్యత, ఖర్చు డెవలపర్‌దేనని ఏపీఈఆర్సీ తీర్పులో స్పష్టంగా ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం 202223లో సాయంత్రం పీక్ అవర్స్‌లో యూనిట్‌ను రూ.11.78 వరకు, సగటున రూ.9.30కు కొనుగోలు చేసిందని, అలాంటిది తాము రూ.4.60కే ఒప్పందం చేసుకోవడం తప్పా అని నిలదీశారు. చంద్రబాబు రాష్ట్ర హితం కోసమే ఆలోచిస్తారని, ప్రజలపై భారం మోపకుండా పాలన చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పట్టాభిరామ్ పేర్కొన్నారు.

# మనసుదోచే రాణ..
# మన తెలంగాణ...



**చార్మినార్... చారిత్రక వైభవానికి సాక్షి. రామోజీ ఫిల్మ్ సిటీ... అతిపెద్ద చిత్రనగరి. రామప్ప... యునెస్కో మెచ్చిన శిల్పఝురి. భద్రాచలం... రామయ్య కొలువుదీరిన పుణ్యస్థలం. యాదగిరి... నృసింహుడి సువిశాల గుడి. కవ్వాల్ అడవి... దండకారణ్యంలో పులుల సఫారీ. అమ్రాబాద్... కృష్ణమ్మ లోయలో వనవిహారం. ఇలాంటి ఎన్నెన్నో వైవిధ్యాల సమాహారం... తెలంగాణ పర్యటకం. ఇది ఆ విశేషాల కదంబం...**






హైదరాబాద్ నగర చరిత్ర... చార్మినార్ నిర్మాణం నుంచే మొదలైందని చెబుతారు! అందుకేనేమో ఈ నగరంవైపు ఆ మాటకొస్తే తెలంగాణవైపు పర్యటకుల్ని ఆకర్షించడంలో ఎప్పుడూ అదే నంబర్ వన్. చార్మినార్, దాని పక్కనే ఉన్న లాడ్‌బజార్, మరో పక్కనున్న మక్కామసీదు... వీటి తర్వాత కొత్తగా చౌమహల్లా ప్యాలస్ వైపూ దారితీస్తున్నారు పర్యటకులు. ఆ ప్యాలస్ కోసమే ప్రత్యేక టూర్ ప్యాకేజీలూ ఉన్నాయి. చార్మినార్ తర్వాత అంతటి పర్యటకాసక్తి ఉన్న చారిత్రక వైభవం... గోల్కొండ కోటది. ఇక్కడికొచ్చే సందర్శకులందరూ పక్కనే ఉన్న కుతుబ్‌షాహీ సమాధి ప్రాంగణానికీ తప్పక వెళుతున్నారు. ఇటీవలే కోట్ల రూపాయల ఖర్చుతో వీటిని పునరుద్ధరించారు. భాగ్యనగరం అనగానే గుర్తొచ్చే మరో పర్యటక కేంద్రం... హుసేన్ సాగర్. ట్యాంక్‌బండ్ ఫుట్‌పాత్ విహారాలూ, లుంబినీ పార్కు లేజర్ షోలూ, బుద్ధవిగ్రహం వద్దకు సాగర్ బోటు ప్రయాణాలు కొత్తాపాతా అన్న తేడాలేకుండా వచ్చినవాళ్లందర్నీ కట్టిపడేస్తాయి. వీటికి తోడు 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహమూ, దాని పక్కనే నూతన సచివాలయ భవనమూ ఈ ప్రాంతానికి కొత్త హంగుల్ని తెచ్చాయి. హుసేన్ సాగర్ దక్షిణాన శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన బిర్లామందిరం... రెండువేల టన్నుల పాలరాళ్లతో నిర్మితమైన ఓ వాస్తు అద్భుతం.





### చుట్టు పక్కల చూస్తే...

రామోజీఫిల్మ్‌సిటీ...మనదైన డిస్నీల్యాండ్. గిన్నిస్‌బుక్‌తో వన్నెకెక్కిన వండర్ లాండ్. సీజన్‌లకి అతీతంగా అటు షూటింగులతోనూ ఇటు సందర్శకులతోనూ కళకళలాడే కమనీయ కలల విహార కేంద్రం. హైదరాబాద్ నుంచి సుమారు 40 కిలోమీటర్ల దూరంలోని ముచ్చింతల్ గ్రామంలో ఏర్పాటుచేసిన 55 అడుగుల రామానుజాచార్యుల విగ్రహం... స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ (సమతామూర్తి)గా ప్రసిద్ధిగాంచింది.

### అతిపెద్ద ఆలయం ఇదే...

యాదగిరిగుట్ట... తెలంగాణలోనే అతిపెద్ద ఆలయ ప్రాంగణం. దేశంలోని నరసింహ ఆలయాలన్నింటా ఇదే అత్యంత విశాలమైనది. ఒకప్పుడు రెండెకరాల్లో ఉన్న ఈ ఆలయాన్ని 16 ఎకరాలకి విస్తరించి... కృష్ణశిలల శిలావిగ్రహాలూ మంటపాలూ తోరణాలతో తీర్చిదిద్దారు. మహబూబ్‌నగర్ జిల్లా జోగులాంబ ఆలయం...తెలంగాణలోని ఏకైక శక్తిపీఠం. శాతవాహనుల కాలంనాటి వేములవాడ రాజన్న, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాలూ... గోదావరి పొడవునా తారసిల్లే బాసర సరస్వతి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, కోటిలింగాల కోటేశ్వరస్వామి, శ్రీకాళేశ్వర ముక్తేశ్వర దేవళాలు ఆధునికతని సంతరించుకుంటున్నాయి. మెదక్ చర్చి... రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద క్రైస్తవాలయం. నాగార్జునసాగర్ సమీపంలో సువిశాల ప్రాంగణంలో ఏర్పాటైన బుద్ధవనం... శాక్యముని భక్తులకే కాదు సామాన్యులకీ సందర్శనీయ కేంద్రం.

### యునెస్కో గుర్తింపుతో...

పర్యటకపరంగా మిగతా నగరాలన్నీ ఒకెత్తు... వరంగల్ ఒక్కటీ ఒకెత్తు. అలనాటి ఏకశిలానగరపు శిథిల దుర్గం... నేటికీ ఏటా లక్షలమందిని తనవద్దకు రప్పించుకుంటోంది. ఈ నగరంలోనే ఉన్న వేయిస్తంభాల గుడి కాకతీయుల వాస్తుకళా వైభవానికి అద్దంపడుతోంది. వరంగల్ నుంచి 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామప్ప ఆలయం... యునెస్కో గుర్తింపుతో అంతర్జాతీయ ఖ్యాతిని అందుకుంది. ఇక్కడి సాలభంజిక శిల్పాల వైభవాన్ని చూడటానికి వేయికళ్లయినా చాలవు. ఈ ఆలయ సముదాయానికి దగ్గర్లోనే ఉన్న లక్నవరం చెరువుకి ఇదివరకే ఉన్న వేలాడే వంతెనతోపాటూ రిసార్టులూ వచ్చి చేరాయి.



### పులులతో సఫారీ...

దండకారణ్యం మన దేశంలోని అతి దట్టమైన అడవుల్లో ఒకటి. ఆ కీకారణ్యంలోని భాగాన్ని కవ్వాల్ రిజర్వ్‌గా మార్చి... సఫారీలూ నిర్వహిస్తోంది తెలంగాణ అటవీ శాఖ. ఇక ఈ రాష్ట్రంలో మరో పులుల సఫారీకేంద్రం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్. వర్షాకాలం తర్వాత నాగార్జున సాగర్ నుంచీ శ్రీశైలానికీ, అట్నుంచటు సోమశిలకూ ప్రత్యేక బోట్‌లతో నదీ ప్రయాణాలు నిర్వహిస్తోంది తెలంగాణ పర్యటక సంస్థ. భద్రాచలం వెళ్లిన భక్తులకి అక్కడి నుంచి కూనవరం మీదుగా పాపికొండల పర్యటననీ నిర్వహిస్తోంది.

*** ఇట్ హ్యాజ్ ఆల్ ఇన్ ఇట్... ఇందులో అన్నీ ఉన్నాయి! తెలంగాణ పర్యటక సంస్థ నినాదం ఇది! ప్రయాణించి చూడాలేకానీ... ఆ నినాదంలో ఎంత నిజముందో మనకు తెలిసి వస్తుంది!**





# ఇంట్లో మేనిక్యూర్...

**చేతులు కోమలంగా, గోళ్లు ఆరోగ్యంగా కనిపించాలంటే మేనిక్యూర్ అవసరమే. దీన్ని ఇంట్లోనే ఎలా చేసుకోవాలంటే...**

ముందుగా గోళ్లపై ఉన్న నెయిల్ పాలిష్ తొలగించండి. ఆపై అరచెంచా ఉప్పు, కొద్దిగా బాదం నూనె, కాస్త నిమ్మరసం కలిపిన మిశ్రమంలో కనీసం 10 నిమిషాలపాటు గోళ్లను నానబెట్టండి. దీనివల్ల గోళ్లు శుభ్రపడటమే కాదు... పసుపు తగ్గి ప్రకాశిస్తాయి. చేతులు టాన్ తగ్గి మెరిసిపోతాయి. రెండో దశలో గోళ్లను కత్తిరించి రౌండ్, స్క్వేర్, ఓవల్... ఇలా మీకు నచ్చిన రూపు ఇవ్వండి. ఆపై గోరువెచ్చని నీళ్లలో రెండు చుక్కల షాంపూ లేదా బాడీవాష్ కలిపి అందులో కనీసం పది నిమిషాలు చేతుల్ని నాననివ్వండి. తర్వాత ఆరెంజ్ స్టిక్ లేదా క్యూటికల్ పుషర్‌తో చుట్టూ ఉన్న మృతచర్మాన్ని తొలగించండి. ఆపై ఆలివ్ ఆయిల్‌తో రుద్దాలి. తర్వాత చిన్న బ్రష్ తీసుకుని గోళ్లపై రుద్దితే సరి. మురికి వదులుతుంది. ఇప్పుడు చెంచా చొప్పున పెరుగు, పంచదార, తేనె కలిపిన మిశ్రమాన్ని చేతులకు రాసి వేళ్లతో వలయాకారంగా స్క్రబ్ చేయండి. చివరగా చేతుల్ని చల్లటి నీళ్లతో కడిగేసి కాస్త బాదం నూనె రాసి మరోసారి మృదువుగా మర్దన చేయండి. వారానికోసారి ఇలా చేయడంవల్ల చేతులు నాజూగ్గా కనిపిస్తాయి.ఆరోగ్యంగానూ ఉంటాయి. గిన్నెలు తోమడం, బట్టలు ఉతకడం వంటి పనులు ఎక్కువగా చేసేవారు... రోజూ రాత్రిపూట గ్లిజరిన్ రాయడాన్ని అలవాటుగా మార్చుకోండి.

# పాక్-భారత్ మధ్య ఉద్రిక్తతలు

## స్వల్ప నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. పాక్తిసాన్‌తో ఉద్రిక్తల వేళ.. కేంద్రం ఈ నెల 7న మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించింది. ఈ క్రమంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. అలాగే, అమెరికాలో మెడిసిన్స్ ఉత్పత్తి చేయాలని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది. అదే సమయంలో అమెరికా ఫెడ్ రిజర్వ్ బుధవారం వడ్డీ రేట్లపై ప్రకటన చేయనున్నది. ఈ క్రమంలో అప్రత్తమంగా వ్యవహరించడంతో మార్కెట్లు పతనమయ్యాయి. అలాగే, మార్కెట్ ప్రారంభం కాగానే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,907.24 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,981.58 పాయింట్లకు పెరిగిన సెన్సెక్స్.. 80,481.03 పాయింట్లకు పడిపోయింది. చివరకు 155.77 పాయింట్లు పతనమై.. 80,641.07 వద్ద ముగిసింది.

నిఫ్టీ 81.55 పాయింట్లు తగ్గి 24,379.60కి తగ్గింది. నిఫ్టీ నిఫ్టీ 81.55 పాయింట్లు తగ్గి 24,379.60 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 787 షేర్లు లాభపడగా.. 3,011 షేర్లు పతనమయ్యాయి. సెన్సెక్స్‌లో ఎటర్నల్, టాటా మోటార్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా అత్యధికంగా నష్టాలను చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందూస్తాన్ యూనిలీవర్, నెస్లే, మారుతి లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లలో షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హాంగ్ సెంగ్ లాభాలతో ముగిశాయి. ఆటో మినహా మిగతా అన్ని రంగాల సూచీలు పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ దాదాపు 5 శాతం, రియాల్టీ ఇండెక్స్ 3.5 శాతం, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా, ఆయిల్, గ్యాస్, పవర్ ఒకటి నుంచి 2.6 శాతం పడిపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 2 శాతం చొప్పున తగ్గాయి.

## ఎలివేట్ కొత్త అపెక్స్ సమ్మర్ ఎడిషన్‌ని లాంచ్ చేసిన హెూండా




**న్యూఢిల్లీ:** హెూండా కార్స్ ఇండియా వాహనాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. కంపెనీకి చెందిన సిటీ, అమేజ్ సెడాన్, ఎలివేట్ ఎస్‌యూవీలతో పోటీ కంపెనీలకు అత్యాధునిక ఫీచర్స్‌తో కార్లను మార్కెట్‌లోకి తీసుకువస్తున్నది. ఈ క్రమంలోనే ఎలివేట్ కొత్త స్పెషల్ అపెక్స్ సమ్మర్ లాంచ్ చేసింది. ఈ స్పెషల్ ఎడిషన్ స్టాండర్డ్ వేరియంట్ కంటే మరింత స్టయిలిష్ లుక్, ఆకర్షణీయమైన కలర్స్‌తో తీసుకువచ్చింది. ఈ సమ్మర్ అపెక్స్ ఎడిషన్ ఎక్స్ షోరూం ధర రూ.12.39లక్షలుగా నిర్ణయించింది. ఈ ధర పరిమిత కాలం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని హెూండా కంపెనీ ప్రకటించింది. ఈ కారు ధర స్టాండర్డ్ వెర్షన్ కంటే దాదాపు రూ.32వేల తక్కువ. ప్రత్యేకత ఏమిటంటే ఈ ఎడిషన్ వీ ట్రిమ్ ఆధారంగా రూపొందించింది.

అలాగే, ఈ ప్రత్యేకమైన అపెక్స్ బ్యాడ్జిలను జోడించింది. డిజైన్‌పరంగా కొత్త రూపాన్ని తీసుకువచ్చింది. ఈ మార్పులతో సరికొత్త లుక్‌ను అందించనున్నది. అపెక్స్ సమ్మర్ ఎడిషన్‌కు కొత్త తొమ్మిది అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ టచ్‌స్క్రీన్ ఈ కారుకు సరికొత్త లుక్‌ను జోడించింది. ఈ స్క్రీన్ 360 డిగ్రీ కెమెరా సపోర్ట్‌ని కలిగి ఉంటుంది. దాంతో పార్కింగ్ సమయంలో మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. ఇంటీరియర్ డిజైన్ విషయంలో హెూండా మంచి కొత్త ఫీచర్స్‌ను అందిస్తున్నది. బయటి నుంచి చూస్తే దీనికి పియానో బ్లాక్, క్రోమ్ ఫినిషింగ్, అపెక్స్ ఎడిషన్ బ్యాడ్జి, సైడ్ స్కర్ట్స్ ఉన్నాయి. ఇవి కారుకు ప్రత్యేక రూపునిస్తాయి. ఇంటీరియర్ గురించి చెప్పాలంటే బ్లాక్ అండ్ వైట్ డ్యూయల్-టోన్ ఇంటీరియర్, కొత్త లెదర్ లాంటి ఫినిష్ సీట్లు, డోర్ ట్రిమ్‌లు, సీట్ కుషన్లు, సెవెన్ కలర్ యాంబియంట్ లైటింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. డాష్‌బోర్డ్, తలుపులు, సాఫ్ట్ టచ్ మెటీరియల్స్ వాడకంతో కేబిన్ గతానికంటే మరింత ప్రీమియం అనుభూతినిస్తాయి.

సమ్మర్ ఎడిషన్‌ను సాధారణ మోడల్‌కు కాస్మెటిక్ అప్‌డేట్ మాత్రమే కాకుండా.. టెక్నాలజీ, ఇంటీరియర్‌లో మార్పులు చేసింది. ఇంజిన్ పవర్ అపెక్స్ సమ్మర్ ఎడిషన్‌లో అదే 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్‌తో వస్తుంది. ఈ వేరియంట్ ప్రధానంగా బ్లాక్ కలర్ స్కీమ్‌లో అందుబాటులో ఉంటుంది. ప్లాటినం వైట్ పెర్ల్ కలర్ కూడా అందుబాటులో ఉంటుంది. కానీ దీని కోసం రూ.8వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రీమియం ఎస్‌యూవీని కోరుకునే కస్టమర్లను దృష్టిలో ఉంచుకుని, బడ్జెట్‌లో కొంచెం రాజీ పడాలనుకునే హెూండా ఈ కొత్త ఎడిషన్‌ని తీసుకువచ్చింది. తక్కువ ధర, మరిన్ని ఫీచర్లు, ఆకర్షణీయమైన డిజైన్ మారుతి సుజుకి గ్రాండ్ విటారా, టయోటా అర్బన్ క్రూయిజర్ హైరైడర్, కియా సెల్టోస్, హ్యుందాయ్ క్రెటాకి బలమైన పోటీ ఇవ్వనున్నది. ఏప్రిల్‌లో హెూండా అమ్మకాలు తగ్గుతాయని అంచనా వేయగా.. ఈ క్రమంలో వాహనదారులను ఆకర్షించి మే నెలల్లో అమ్మకాలను పెంచుకునే లక్ష్యంతో ఈ కొత్త ఎడిషన్‌ను తీసుకువచ్చింది.

## ఆ కంపెనీకే ఎలక్ట్రిక్ స్కూటర్ ఆఫ్ ది ఇయర్ టైటిల్..




**న్యూఢిల్లీ:** గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ తన ఈవీ స్కూటర్లతో ప్రజలను అమితంగా ఆకర్షిస్తుంది. 2025 బైక్ ఇండియా అవార్డుల సందర్భంగా ఆంపియర్ నెక్సస్ ఈవీ స్కూటర్‌కు 'ఎలక్ట్రిక్ స్కూటర్ ఆఫ్ ది ఇయర్' టైటిల్‌ను గెలుచుకుంది. మార్కెట్లో వాల్యూ యాడెడ్ ఈ-స్కూటర్లలో ఒకటిగా గుర్తించారు. ఈ స్కూటర్ నవంబర్ 2024లో ఇండియా డిజైన్ మార్క్ అవార్డును కూడా గెలుచుకుంది. ఈ మోడల్ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 10,000 ప్లస్ కిలోమీటర్లు ప్రయాణించిన రికార్డును కూడా కలిగి ఉంది. ఈ అవార్డుపై గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీఈఓ కె. విజయ కుమార్ మాట్లాడుతూ ఈ గుర్తింపు నిజంగా గౌరవంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. భారతదేశం అంతటా సురక్షితమైన, స్మార్ట్ ఈవీలను అందుబాటులోకి తీసుకురావాలనే తమ కంపెనీ లక్ష్యమని పేర్కొన్నారు.

ఆంపియర్ నెక్సస్ ఈవీ భారతదేశంలో రూ. 1.14 లక్షల ధరతో ప్రారంభించారు. అయితే టాప్ మోడల్ ధర రూ. 1.24 లక్షల వరకు ఉంటుంది. ఈ స్కూటర్ మొత్తం 4 రంగుల ఎంపికల్లో అందుబాటులో ఉంటాయి. ఈ ఈవీ పోర్టబుల్ 3 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ సెటప్‌తో వస్తుంది. ఈ స్కూటర్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే గరిష్టంగా 136 కి.మీ వరకు మైలేజ్ ఇస్తుంది. ఈ స్కూటర్ గరిష్టంగా 93 కి.మీ వేగంతో దూసుకుపోతుంది. ఈ స్కూటర్ బ్యాటరీని కేవలం 3 గంటల్లోనే 0 నుంచి 100 శాతం వరకు ఛార్జ్ చేయవచ్చు. ఆంపియర్ నెక్సస్ సురక్షితమైన, మన్నికైన ఎల్ఎఫ్‌పీ బ్యాటరీ ప్లాట్‌ఫామ్‌పై నిర్మించడంతో అత్యాధునిక సాంకేతికత ఈ బ్యాటరీ సొంతం గ్రీవ్స్ కంపెనీ కొత్త అండర్‌బోన్ ఛాసిస్‌ను ఉపయోగించింది. దీనికి ముందు భాగంలో టెలిస్కోపిక్ ఫోర్క్, వెనుక భాగంలో ట్విన్ షాక్ అబ్జార్బర్‌లు ఉన్నాయి.ఈ స్కూటర్ స్టైలిష్ 12 అంగుళాల అల్లాయ్ వీల్స్ పై నడుస్తుంది. మెరుగైన గ్రిప్ కోసం ఎంఆర్ఎఫ్ టైర్లతో వస్తుంది.



# ముంబై వర్సెస్ గుజరాత్ మ్యాచ్‌లో హైడ్రామా..



### చివరి ఓవర్‌లో గుజరాత్ గెలుపు, టేబుల్‌లో టాప్‌లోకి

**ముంబై:** ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ జోరుకు గుజరాత్ టైటాన్స్ చెక్ పెట్టింది. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచులో చివరి బంతికి గుజరాత్ గెలుపు గీతను దాటింది. వర్షం దోబూచులాడిన ఈ మ్యాచులో.. ఆటతో పాటు కాస్త అదృష్టం కూడా గుజరాత్ టైటాన్స్‌కు కలిసొచ్చింది. దీంతో జట్టు.. 3 వికెట్ల తేడాతో గెలుపొందింది.

ఈ మ్యాచులో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 రన్స్ చేసింది. అయితే ఆ తర్వాత మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్.. గుజరాత్ టైటాన్స్.. 18 ఓవర్లలో 132/6 వద్ద ఉన్న దశలో వర్షం అంతరాయం కలిగించింది. చాలా సేపటి వరకు వర్షం తగ్గలేదు. దీంతో మ్యాచ్ రద్దు అయ్యేలా కనిపించింది. కానీ చివర్లో తగ్గడంతో ఒక్క ఓవర్ మ్యాచ్ ఆడించాలని అంపైర్లు నిర్ణయించారు. ఒక్క ఓవర్‌లో గుజరాత్ టైటాన్స్ లక్ష్యం 15 పరుగులుగా ఖరారు చేశారు.




ఈ దశలో టీ20 మ్యాచ్ కాస్తా సూపర్ ఓవర్ మ్యాచులా మారిపోయింది. అప్పటికి క్రీజులో రాహుల్ తెవాటియా, గెరాల్డ్ కొయెట్జీ ఉన్నారు. అప్పటికే జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, అశ్వనీ కుమార్ కోటా పూర్తి కావడంతో కెప్టెన్ పాండ్యా.. దీపక్ చాహర్‌కు బంతి అందించాడు.

స్ట్రైకింగ్‌లో ఉన్న రాహుల్ తెవాటియా తొలి బంతికే ఫోర్ కొట్టాడు. రెండో బంతికి సింగిల్ రావడంతో సమీకరణం 4 బంతుల్లో 10 రన్స్‌గా మారింది. కానీ ఆ తర్వాత చివరి ఓవర్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే కొయెట్జీ స్టాండ్స్‌లోకి తరలించాడు. ఆ తర్వాత బంతికి సింగిల్ తీయగా.. అది నోబాల్. దీంతో సమీకరణం 3 బంతుల్లో 2 పరుగులుగా మారిపోయింది. ఈ సమయంలో తెవాటియా సింగిల్ తీయడంతో స్కోర్లు సమమయ్యాయి. అయితే రెండు బంతుల్లో ఒక్క రన్ అవసరమైన దశలో గెరాల్డ్ కొయెట్జీ క్యాచ్ అవుట్ అయ్యాడు. దీంతో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది.

కానీ చివరి బంతిని ఎదుర్కొన్న అర్షద్.. ఒక్క రన్ పూర్తి చేయడంతో గుజరాత్ టైటాన్స్ విజయం సాధించింది. ఐపీఎల్ 2025లో 11 మ్యాచ్‌లలో 8వ విజయాన్ని నమోదు చేసింది. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానికి దూసుకెళ్లింది. అటు ముంబై డబుల్ హ్యాట్రిక్ విజయాలకు ఈ ఫలితంతో చెక్ పడ్డట్లయింది.

# అమ్మో అశుతోష్..

### ఢిల్లీ 'ట్రబుల్‌షూటర్' అయ్యాడిలా..!

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18వ ఎడిషన్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరిస్తున్నారు కొందరు కుర్రాళ్లు. క్లిష్ట సమయంలో కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టును ఆదుకుంటున్నారు. అలవోకగా పెద్ద షాట్లు ఆడుతూ ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పేస్తున్నారు. వీళ్లలో అశుతోష్ శర్మ పేరు ముందు వరుసలో ఉంటుంది. అతడు క్రీజులోకి వస్తే చాలు బౌలర్లు వణికిపోతున్నారు. ఒత్తిడిలోనూ మెరుపు షాట్లతో అలరించే ఈ కుర్రాడు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ట్రబుల్ షూటర్‌గా మారాడు. అవును.. బౌలర్ల పాలిట సింహస్వప్నంగా మారిన అతడు ఎంతటి కష్ట సమయంలోనైనా జట్టును ఒడ్డున పడేస్తున్నాడు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ పేసర్ల ధాటికి 62 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన ఢిల్లీకి ఆపద్బాంధవుడయ్యాడీ హిట్టర్. తన పవర్ స్ట్రోక్‌తో అలరించిన అశుతోష్ 26 బంతుల్లోనే 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 41 రన్స్ చేసి.. అక్షర్ పటేల్ బృందానికి పోరాడగలిగే స్కోర్ అందించాడు. ఉప్పల్ స్టేడియంలో అతడి విధ్వంసాన్ని కళ్లారా చూసిన ప్రతి ఒక్కరు ఢిల్లీ ట్రబుల్‌షూటర్ అనే పదానికి అశుతోష్ నూరుపాళ్లు న్యాయం చేస్తున్నాడని అంటున్నారు.

### 28 బంతుల్లోనే 61

నిజానికి 17వ సీజన్‌లోనే అశుతోష్ పేరు మార్మోగిపోయింది. పంజాబ్ కింగ్స్‌కు ఆడిన ఈ




చిచ్చరపిడుగు ఆ జట్టు చిరస్మరణీయ విజయాల్లో భాగమయ్యాడు. ఇప్పుడు ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు అశుతోష్. ప్రతి మ్యాచ్‌లో తన మార్క్ బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడీ యంగ్‌స్టర్. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 15 ఓవర్లో క్రీజులోకి వచ్చిన అశుతోష్ 19 బంతుల్లోనే 37 రన్స్ సాధించాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లను ఉతికారేసిన ఈ కుర్రాడు కేవలం 28 బంతుల్లోనే 61 పరుగులతో రెచ్చిపోయాడు.

ఇక సోమవారం ఉప్పల్ మైదానంలో ఈ యంగ్‌స్టర్ ట్రిస్టన్ స్టబ్స్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే.. వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడంతో అశుతోష్ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైంది.

# ద్రవిడ్ చాలా స్ట్రిక్ట్..

### ఆరోజు మా ముగ్గురిని ఎండలో పరుగెత్తించాడు..!

**న్యూఢిల్లీ:** భారత జట్టు మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ ఎంత కూల్‌గా ఉంటాడో తెలిసిందే. మైదానంలోపలా, మైదానం బయటా ప్రశాంతంగ కనిపించే అతడు క్రమశిక్షణ విషయంలో రాజీ పడడు. టీమిండియా కెప్టెన్‌గా, కోచ్‌గా ద్రవిడ్ వైఖరి అలానే ఉండేది. అంతేకాదు కెప్టెన్సీ చేపట్టడానికి ముందు కూడా ఈ వాల్ సమయపాలనలో అందరికీ ఆదర్శంగా నిలిచేవాడు. జట్టులో సీనియర్‌గా కొత్త కుర్రాళ్లకు టైమింగ్ అలవాటు చేసేవాడు. అయితే.. ఒకానొక సందర్భంలో ద్రవిడ్ తనతో పాటు రోహిత్ శర్మ, యువరాజ్ సింగ్‌లను హెూటల్ బయట ఎండలో పరిగెత్తించాడని మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా వెల్లడించాడు.

'రోహిత్, యువరాజ్, నేను అప్పుడప్పుడే అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నాం. శ్రీలంక పర్యటనకు సీనియర్లు సచిన్, అనిక్ కుంబ్లే, గంగూలీ, ద్రవిడ్‌లతో కూడిన జట్టులో మా ముగ్గురికి చోటు దక్కింది. ఈ టూర్ సమయంలోనే ఒక ఆసక్తికర సంఘటన జరిగింది. నేను, యూవీ, రోహిత్ కలిసి భోజనం చేసేవాళ్లం. అయితే.. ఒక రోజు మీల్స్ పూర్తి చేయడానికి ఎక్కువ సమయం తీసుకున్నాం. దాంతో, ఆగ్రహించిన ద్రవిడ్ మా ముగ్గురికి పనిష్మెంట్ ఇచ్చాడు. హెూటల్ బయట ఉన్న ఖాళీ స్థలంలో మమ్మల్ని పరుగెత్తించాడు' అని




ఓజా వివరించాడు.

### అత్యుత్తమ ప్రదర్శన 6-47

ఎడమ చేతివాటం స్పిన్నర్ అయిన ఓజా ఫస్ట్ క్లాస్‌లో అదిరిపోయే ప్రదర్శనతో 2008లో భారత జట్టుకు ఎంపికయ్యాడు. 24 టెస్టులు, 18 వన్డేలు, 6 టీ20లు ఆడాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 113 వికెట్లు తీసిన అతడు.. 6-47తో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. 7 పర్యాయాలు ఐదేసి వికెట్లు తీసిన ఓజా.. ఒకే ఒకసారి 10 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లోనూ సత్తా చాటిన ఓజా 2009లో టైటిల్ గెలుపొందిన దక్కన్ ఛార్జర్స్ జట్టులో సభ్యుడు. ప్రస్తుతం ఈ వెటరన్ స్పిన్నర్ ఐపీఎల్‌లో కామెంటేటర్‌గా సేవలందిస్తున్నాడు.

# అందుకే కెప్టెన్సీ వదులుకున్నా.. ఆర్సీబీ బోల్డ్ డైరీస్‌లో కోహ్లీ !

**బెంగళూరు:** ఐపీఎల్ 18వ ఎడిషన్‌లో చెలరేగి ఆడుతున్న విరాట్ కోహ్లీ అప్పుడప్పుడు తన కెరియర్ గురించిన పలు విషయాల్ని అభిమానులతో పంచుకుంటున్నాడు. తాజాగా ఆర్సీబీ 'బోల్డ్ డైరీస్'లో మాట్లాడుతూ విరాట్ ఆసక్తికర సంగతులు చెప్పాడు. తాను టీమిండియా కెప్టెన్సీతో పాటు బెంగళూరు సారథిగా వైదొలగడానికి కారణాలను వెల్లడించాడు.

'భారత జట్టుకు కెప్టెన్‌గా నాపై ఒత్తిడి ఉండేది. జట్టు ప్రదర్శనకు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. అయినా సరే కొన్నిసార్లు విమర్శలు తప్పేవి కావు. దాంతో, ఇక నావల్ల కాదనిపించింది. 2016 -19 మధ్య నా కెరియర్ ఉన్నతంగా సాగింది. అయితే.. ఆ తర్వాత ఫామ్ లేమితో పాటు జట్టు నిరాశజనక ప్రదర్శన కూడా నేను ఒక నిర్ణయానికి వచ్చేలా చేశాయి.

పైగా నేను సంతోషంగా ఉంటూ ఆటను ఆస్వాదించాలనుకున్నా. ప్రశాంతంగా ఉంటూ జట్టులో సభ్యుడిగా కొనసాగాలి అనుకున్నా. అందుకే సారథిగా తప్పుకున్నాను. ఐపీఎల్ 16వ సీజన్‌లో ఆర్సీబీ కెప్టెన్‌గానూ వైదొలిగా' అని కోహ్లీ వెల్లడించాడు.

### గంగూలీ తరహాలో..

అండర్ -19 వరల్డ్ కప్ హీరోగా టీమిండియాకు ఎంపికైన విరాట్.. అనతికాలంలోనే జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. మహేంద్ర సింగ్ ధోనీ నుంచి పగ్గాలు అందుకున్న ఈ రన్‌మెషీన్.. సౌరవ్ గంగూలీ తరహాలోనే టీమిండియాకు దూకుడు నేర్పాడు. విరాట్ కెప్టెన్సీలోనే భారత్ టెస్టుల్లో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. అంతేకాదు ఐసీసీ తొలిసారి నిర్వహించిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆడింది. 2013 నుంచి 2022 వరకూ 213 మ్యాచుల్లో కోహ్లీ టీమిండియాకు నాయకత్వం వహించాడు. 2011 నుంచి 2023 వరకూ..143 మ్యాచుల్లో ఆర్సీబీకి కెప్టెన్‌గా ఉన్నాడు.

విరాట్ నేతృత్వంలో బెంగళూరు 2014, 2016లో ఫైనల్‌కు చేరింది. కానీ, ఆఖరి మెట్టుపై తడబడి కప్పు




చేజార్చుకుంది. అయితే.. ఆరంభ సీజన్ నుంచి ఊరిస్తున్న ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడేందుకు ఆర్సీబీ ఈసారి సర్వశక్తులు ఒడ్డుతోంది.

టాపార్డర్‌లో విరాట్, పడిక్కల్, కెప్టెన్ పటిదార్‌లు దంచేస్తుంటే.. బౌలింగ్‌లో హేజిల్‌వుడ్, భువనేశ్వర్, కృనాల్ పాండ్యాలు ప్రత్యర్థిని వణికిస్తున్నారు. దాంతో, 11 మ్యాచుల్లో 8 విజయాలతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్లే ఆఫ్స్ రేసులో అందరికంటే ముందున్న బెంగళూరు ఈసారి ట్రోఫీతో మురిసిపోవాలని అనుకుంటోంది. అదే జరిగితే.. సుదీర్ఘ నిరీక్షణకు తెరపడినట్టే.

# ఇట్స్ కన్ఫామ్.. తల్లిదండ్రులు కాబోతున్న లావణ్య, వరుణ్ తేజ్

టాకీస్: టాలీవుడ్ యువ కథానాయకుడు వరుణ్ తేజ్, నటి లావణ్య త్రిపాఠి దంపతులు తమ అభిమానులకు ఓ తీపి కబురు అందించారు. తాము త్వరలో తల్లిదండ్రులం కాబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించారు. గత కొంతకాలంగా లావణ్య గర్భవతి అంటూ వస్తున్న వార్తలకు ఈ ప్రకటనతో తెరపడింది. ఈ జంట తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలలో ఓ ప్రత్యేకమైన ఫొటోను పంచుకున్నారు. ఆ ఫొటోలో చిన్నారి షూస్‌తో పాటు వరుణ్, లావణ్య ఒకరి చేతిని ఒకరు పట్టుకుని కనిపించారు. ఈ ఫొటోకు "జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించబోతున్నాం. త్వరలో రాబోతుంది" అనే అర్థవంతమైన వ్యాఖ్యను జోడించి, తమ



ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్‌గా మారింది. గతేడాది (2023) ఇటలీలో వైభవంగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ ప్రేమ బంధాన్ని తర్వాతి దశకు తీసుకువెళ్తున్నట్లు ఈ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ వార్త తెలియగానే మెగా కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా వరుణ్, లావణ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నెటిజన్లు కూడా వారికి అభినందనలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు. మెగా ఫ్యామిలీలో సంతోషకరమైన వాతావరణం నెలకొంది. సినిమాల విషయానికొస్తే, వరుణ్ తేజ్ వివాహం తర్వాత కూడా వరుసగా చిత్రాల్లో నటిస్తూ కెరీర్‌పై దృష్టి సారించారు. ప్రస్తుతం ఆయన పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

## కర్నాటక షూటింగ్ ముగించిన ఎన్టీఆర్



**టాకీస్:** జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు. కర్ణాటకలో మొన్నటి వరకు షూటింగ్ నిర్వహించారు. షూటింగ్ సెట్స్ నుంచి తాజాగా ఎన్టీఆర్ హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్ట్ వద్ద ఎన్టీఆర్ స్టైలిష్ లుక్ లో కనిపించారు. చూస్తుంటే చాలా రగ్గ్‌డ్ లుక్ లో ఉన్నారు. కాస్త బక్కగా మారిపోయిన ఎన్టీఆర్.. గుబురు గడ్డంతో కొత్త లుక్ లోకి మారిపోయాడు. ఇందుకు సంబంధించిన పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ ఇలాంటి లుక్ లో గతంలో కనిపించాడు. మళ్లీ ఇప్పుడే కనిపిస్తున్నాడు. ఓ వైపు వార్-2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అది ఇంకా రిలీజ్ కాకముందే ప్రశాంత్ నీల్ మూవీని సెట్స్ మీదకు తీసుకెళ్లాడు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. 2026 జూన్ 25న రిలీజ్ చేస్తున్నట్టు- ఇప్పటికే ప్రకటించారు. త్వరలోనే విదేశాల్లో షూటింగ్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ నీల్ మూవీ అంటే కచ్చితంగా ఎలివేషన్లు ఉ ండాల్సిందే. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ కు ఎలాంటి ఎలివేషన్లు ఉంటాయో చూడాలి. ఈ మూవీలో ఇంకా నటీ-నటు-లను తీసుకుంటూనే ఉన్నారు.

## పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌కి పిచ్చెక్కించే న్యూస్..

### క్రేజీ అప్‌డేట్ ఇచ్చిన చిత్ర బృందం

**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయాలలోకి వచ్చాక సినిమాలు చేయడం తగ్గించారు. కొత్త ప్రాజెక్టులకి సైన్ చేయడం లేదు. గతంలో కమిటైన సినిమాలు పూర్తి చేసే పనిలో పడ్డారు. పవన్ గత కొద్ది రోజులుగా నటిస్తున్న హరిహర వీరమల్లు చిత్రం వాయిదాల మీద వాయిదా పడుతుంది. ఈ చిత్రం పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతుంది. ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లి దాదాపు ఐదేళ్లు అవుతుంది. . రాజకీయాల్లో బిజీగా మారిన పవన్ తన సినిమా ప్రాజెక్టులకు డేట్స్ కేటాయించలేకపోయాడు. అయినప్పటికీ, చేతిలో ఉన్న మూడు సినిమాలను పరిస్థితుల్లోనైనా ఆగస్టు లోగా పూర్తిచేస్తానని నిర్మాతలకు మాటిచ్చినట్టు సమాచారం.



తాజాగా పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు చిత్రాన్ని పూర్తి చేశారు. పవన్ కెరీర్‌లో తొలిసారిగా పాన్ ఇండియా లెవెల్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఎట్టకేలకి షూటింగ్ చివరకు పూర్తయింది. చివరి రెండు రోజుల చిత్రీకరణకు పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. దీనిపై చిత్రబృందం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

## బేబీ బంప్‌తో 'కియారా అద్వానీ'



టాకీస్: ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'మెట్ గాలా' ఫ్యాషన్ ఈవెంట్ న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్‌లో అట్టహాసంగా జరుగుతోంది. అంతర్జాతీయంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొని తమ స్టైల్‌తో ఆకట్టుకుంటున్నారు. ఈ ఏడాది 'మెట్ గాలా'లో పలువురు భారతీయ తారలు కూడా సందడి చేశారు.

ముఖ్యంగా, బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఈ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలుగులో 'భరత్ అనే నేను', 'వినయ విధేయ రామ' చిత్రాలతో ప్రేక్షకులకు పరిచయమైన కియారా అద్వానీ, 'మెట్ గాలా' వేడుకలో పాల్గొనడం ఇదే మొదటిసారి. ప్రముఖ భారతీయ డిజైనర్ గౌరవ్ గుప్తా ప్రత్యేకంగా రూపొందించిన గౌనులో ఆమె రెడ్ కార్పెట్‌పై నడిచారు. అయితే, ఈ సందర్భంగా కియారా బేబీ బంప్‌తో కనిపించడం అందరి దృష్టిని ఆకర్షించింది. గత కొంతకాలంగా ఆమె గర్భవతి అనే వార్తలు వస్తున్న నేపథ్యంలో, 'మెట్ గాలా' వేదికపై బేబీ బంప్‌తో కనిపించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కియారా బాలీవుడ్ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రియాంక చోప్రా కూడా తన భర్త, పాప్ సింగర్ నిక్ జోనస్‌తో కలిసి ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే, ప్రముఖ పంజాబీ సింగర్, నటుడు దిల్జిత్ దోసాంజ్ తనదైన పంజాబీ రాయల్టీ స్టైల్‌లో 'మెట్ గాలా'లో ప్రత్యేకంగా నిలిచారు.

## క్యాథరిన్ త్రెసాకు బంపర్ ఆఫర్



టాకీస్: టాలీవుడ్‌లో అందం అభినయంతో ఆకట్టుకొనే గ్లామర్ హీరోయిన్ లో క్యాథరిన్ త్రెసా ఒకరు. 'చమ్మక్ చలో' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ- ఇచ్చి నానితో 'పైసా', అల్లు అర్జున్‌తో 'ఇద్దరు అమ్మాయిలతో', 'రుద్రమదేవి', 'సరైనోడు' వంటి చిత్రాల్లో నటించింది. వరుస విజయాలతో దూసుకెళ్లిన క్యాథరిన్ తెరపై కనిపించి చాలాకాలం అవుతుంది. అవకాశాలు తగ్గడంతో సైలెంట్ అయిపోయింది. సోషల్ మీడియాలో కూడా కనిపించడం లేదు. ఇక తాజాగా ఈ అమ్మడు బంపర్ ఆఫర్ కొట్టేసింది..

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబోలో మంచి ఫ్యామిలీ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మే లాస్ట్ వీక్ లో ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమాలు, ఓపెనింగ్ అయిపోయింది కాబట్టి నేరుగా సెట్స్ లోకి వెళ్ళిపోతారు. ఇక ముందు నుంచి వైరల్ అవుతున్నట్లు-గా మెయిన్ హీరోయిన్‌గా నయనతార ఒకే అయిన విషయం తెలిసిందే. ఇక రెండో కథానాయికగా క్యాథరిన్ త్రెస్సా ఒకే అయ్యిందట. సెకండ్ హీరోయిన్ అయినప్పటికి చిరుతో ఒకటి రెండు పాటలు ఉండబోతున్నయట. అయితే ఇక్కడ క్యాథరిన్ చిరుకి సంబంధించి ఓ వార్త వైరల్ అవుతుంది..

ఏంటీ- అంటే.. చిరంజీతో నటించే అవకాశం క్యాథరిన్ కు 2017లోనే వచ్చిందట. 'ఖైదీ నెంబర్ 150' కోసం వివి వినాయక్ తొలుత ఆమెనే అనుకున్నారట. కానీ సుష్మితతో వచ్చిన విభేధాల కారణంగా క్యాథరిన్‌ని తప్పించి కాజల్ అగర్వాల్‌ని తీసుకున్నారట. ఇక కట్ చేస్తే తొమ్మిది సంవత్సరాల తర్వాత క్యాథరిన్ తిరిగి ఆ ఛాన్స్ దక్కించుకోవడం విశేషం.

## విడుదల తేదీ ప్రకటించిన రాజేంద్ర ప్రసాద్ 'షష్ఠి పూర్తి'

టాకీస్: టాలీవుడ్ యువ దర్శకుడు పవన్ ప్రభ దర్శకత్వంలో యువ కథానాయకుడు రుపేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'షష్ఠి పూర్తి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకోగా.. చిత్రబృందం తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రం మే 30వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మేరకు నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా



ప్రత్యేకమైన పోస్టర్‌ను విడుదల చేసింది.

'షష్ఠి పూర్తి' చిత్రం ఆహ్లాదకరమైన కథాంశంతో తెరకెక్కినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలోని ముఖ్యమైన సన్నివేశాలను రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో, గోదావరి నదీ తీర ప్రాంతాల యొక్క సహజమైన అందమైన లొకేషన్లలో చిత్రీకరించారు. టాలీవుడ్‌లో తమదైన ముద్ర వేసిన సీనియర్ నటులు రాజేంద్ర ప్రసాద్, అర్చన ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఒకప్పుడు 'లేడీస్ టైలర్' వంటి సూపర్ హిట్ చిత్రంలో కలిసి నటించిన ఈ జంట మళ్లీ ఈ సినిమా ద్వారా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు.

ఈ చిత్రానికి రామ్ రెడ్డి ఛాయాగ్రహణం అందిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సంగీత సామ్రాట్ ఇళయరాజా ఈ సినిమాకు తన మధురమైన సంగీతాన్ని అందిస్తున్నారు. 'షష్ఠి పూర్తి' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉ ంటుందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## మోహన్ లాల్‌కి తప్పని పైరసీ కష్టాలు..

### టూరిస్ట్ బస్సులో ప్రసారం అయిన 'తుడరుమ్'





**టాకీస్:** మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ బ్యాక్ టూ బ్యాక్ సూపర్ హిట్లు అందుకున్న విషయం తెలిసిందే. మార్చిలో ఎల్2 ఎంపురాన్ అంటూ వచ్చి సూపర్ హిట్ అందుకున్న నటుడు తాజాగా 'తుడరుమ్' చిత్రంతో మరో హిట్‌ని ఖాతాలో వేసుకున్నాడు.

ఏప్రిల్ 25న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. ఇప్పటికే రూ. 160 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి మలయాళంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో చేరింది. 'తుడరుమ్' చిత్రంలో మోహన్‌లాల్ సరసన శోభన నటించగా, దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత వీరిద్దరూ కలిసి నటించడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయితే, ఈ సినిమా పైరసీ బారిన పడటం సినీ పరిశ్రమలో మరోసారి ఆందోళన కలిగిస్తోంది. తాజాగా, కేరళలోని మలప్పురానికి చెందిన ఓ టూరిస్ట్ బస్సులో 'తుడరుమ్' సినిమాను అక్రమంగా ప్రదర్శించినట్లు వెలుగులోకి వచ్చింది.

ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చిత్ర నిర్మాత ఎం.రంజిత్ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కేరళ మంత్రి సాజిచెరియన్, సరైన ఆధారాలు లభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.